



# విజయభాను






విశాఖపట్నం, మంగళవారం 30-01-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 137 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### 1000 కిలోమీటర్లు పూర్తయిన

# ప్రజాసంకల్పయాత్ర

- జనసంద్రమైన సైదాపురం..
- పైలాన్ ఆవిష్కరించిన వైఎస్ జగన్
- రాయలసీమలో ప్రజాసంకల్పయాత్ర పూర్తి



నెల్లూరు : ప్రజాసంకల్పయాత్రలో భాగంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో 1000 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది.

మూడువేల కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రలో వెయ్యి కిలోమీటర్ల మైలురాయిని ఆయన సోమవారం వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం వద్ద దాటారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, గ్రామస్థులు వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన సైదాపురంలో పైలాన్‌ను ఆవిష్కరించారు.

తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న అన్యాయాలను ఎండగడుతూ, ప్రజా సమస్యలను సావధానంగా వింటూ వైఎస్ జగన్ పాదయాత్రను కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి రాగానే రాజన్న తనయుడిగా ప్రజామోద పాలన అందిస్తామని భరోసానిస్తూ ముందుకెళ్తున్నారు. స్ఫూర్తిదాయక హామీలతో కొనసాగుతున్న వైఎస్ జగన్ ప్రజాసంకల్పయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. పార్టీ అధిష్టానం తరువాయి 2లో

# సాధికారతే మా తంత్రం

## పార్లమెంట్‌లో తొలిసారిగా రాష్ట్రపతి కోవింద్ ప్రసంగం

దిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల్లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తొలిసారిగా ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కోవింద్ మాట్లాడుతూ.. మైనార్టీ, పేద ప్రజలను బుజ్జగించేందుకు ప్రభుత్వం పనిచేయడం లేదని.. వారి సాధికారతే తమ ప్రభుత్వ మంత్రమని అన్నారు.

ఆర్థిక, సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం స్థిరపడలేదని బాబా సాహేబ్ అంబేడ్కర్ చెబుతుండేవారు. నవ భారత కలలను సాకారం చేసుకునేందుకు ఈ 2018 ముఖ్యమైన సంవత్సరం. మన దేశం యువకుల దేశం. యువత కోసం ప్రభుత్వం స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, స్కిల్ ఇండియా, ప్రధానమంత్రి ముద్ర యోజన లాంటి ఎన్నో పథకాలను తీసుకొచ్చింది. 2022 నాటికల్లా రైతులకు రెట్టింపు ఆదాయం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రతి ఒక్కరికీ అభివృద్ధిని చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాలకు కూడా అధునాతన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం





పనిచేస్తోంది. కూలీల కనీస వేతనాన్ని కూడా ప్రభుత్వం పెంచింది అని రాష్ట్రపతి అన్నారు.

అంతేగాక.. దేశంలో అవినీతిని నిర్మూలించేందుకు ప్రభుత్వం చేస్తున్న పోరాటం కొనసాగుతోందని రాష్ట్రపతి కోవింద్ అన్నారు. గడిచిన ఏడాది కాలంలో 3.50లక్షలకు పైగా అనుమానాస్పద కంపెనీల రిజిస్ట్రేషన్లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆధార్ గురించి కూడా రాష్ట్రపతి ప్రస్తావించారు. ఆధార్.. దళారీ విధానాన్ని రూపుమాపుతోందని, పేదల హక్కులకు ఎంతగానో దోహదపడుతోందని ప్రశంసించారు. ఆధార్ వల్ల రూ.57వేల కోట్లను మోసగాళ్ల తరువాయి 2లో

# ఏసీబీ వలలో వుడా అధికారి

- ఉభయ రాష్ట్రాల్లో 12 చోట్ల ఏకకాలంలో దాడులు
- భారీగా స్థల పత్రాలు, బంగారం స్వాధీనం
- విజయవాడ డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో సోదాలు



సోదాలో దొరికిన అక్రమాస్తులు

విశాఖ క్రైం: వుడాలో అడిషనల్ చీఫ్ అర్బన్ ప్లానర్‌గా రెండు వారాల క్రితమే విధుల్లో చేరిన పశుపర్తి ప్రదీప్ కుమార్ అక్రమాస్తులపై ఏసీబీ దాడులు ప్రారంభించింది. తెలంగాణా ఆంధ్రాల్లో కలిపి మొత్తం 12 చోట్ల ఏకకాలంలో దాడులు కొనసాగుతున్నాయి. విశాఖలోని దసపల్లా హిల్స్‌లో నటరాజాటవర్స్‌లో విజయవాడ డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో సోదాలు జరుగుతున్నాయి. ఇంటిలో 4 లక్షల నగదు, ఒక కేజీ బంగారు ఆభరణాలు, 5 కేజీల వెండి వస్తువులు లభ్యమయ్యాయి. 20 లక్షల వరకు ఎఫ్.డి.ఆర్.లు కూడా దొరికాయి. అనంతపూర్, విజయవాడ, ఒంగోలు, హైదరాబాద్‌లలో కూడా తరువాయి 2లో

### వ్యవసాయ అనుబంధ రంగాల్లో

# 25.6 శాతం వృద్ధి సాధించాం

- వ్యవసాయ రంగాభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్
- బిందు, తుంపర్ల యూనిట్ల తయారీ కంపెనీలతో 31న సదస్సు
- రాష్ట్ర మంత్రులు చంద్రమోహన్ రెడ్డి, గంటా శ్రీనివాస రావు




విశాఖపట్నం: రాష్ట్రంలోని రైతుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఎస్. చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. దేశంలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో స్థూల విలువ జోడింపు వృద్ధి రేటు 2.5 శాతం కాగా, రాష్ట్రంలో 25.6 శాతం వృద్ధి రేటును నమోదు చేసుకోవడమే తరువాయి 2లో

# కాపు రిజర్వేషన్లపై ప్రైవేట్ బిల్లు

### అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి



విశాఖపట్నం: రానున్న పార్లమెంట్ సమావేశాల్లో కాపు రిజర్వేషన్లపై ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం విశాఖపట్నంలోని తన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపు రిజర్వేషన్ల విషయమై జనవరి 18న పార్లమెంట్‌కు లేఖ రాశానని, ఆ మేరకు లోక్‌సభలో బిల్లు పెట్టడానికి తరువాయి 2లో






# సిట్ ఫైల్‌లో భూబకాసురుల జాతకాలు



- అవినీతి అధికార వర్గాల గుండెల్లో గుబులు
- నాగేశ్వరరావు లాంటి అనకొండలు ఎంతమందో!?
- వివిధ మాధ్యమాల ద్వారా 2875 ఫిర్యాదులు
- వ్యవస్థ లోపాలు సరిదిద్దేందుకు సూచనలు
- ఇచ్చిన సమయంకన్నా 2 నెలలు పొడిగింపు
- సిట్ సమగ్ర నివేదిక ప్రభుత్వానికి అందజేత

విశాఖపట్నం: ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడిన ప్రత్యేక దర్యాప్తు బృందం, ప్రభుత్వ భూములు, రెవెన్యూ భూదస్త్రాల అవకతవకలు మొదలగు వాటిపై ప్రజలనుండి ప్రజాప్రతినిధులు మరియు వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు నుండి కలెక్టర్ వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫిర్యాదుల విభాగం ద్వారా మరియు వివిధ మాధ్యమాల ద్వారా 2875 ఫిర్యాదులు స్వీకరించి వాటిలో ప్రభుత్వ ఉత్తర్వుల పరిధిలోని 333 ఫిర్యాదులు విచారణకు చేపట్టడమైనది. అదే విధంగా ప్రజా నాయకుల నుండి కూడా 11 ఫిర్యాదులు స్వయంగా స్వీకరించి విచారణ చేయడమైనది. తదుపరి ప్రభుత్వం విస్తృత పరిచిన ఉత్తర్వుల ప్రకారం ఎన్ఓసిలు వంటి విషయాలపై కూడా దృష్టి సారించి విచారణ చేయడమైనది. ఇందుకు ప్రభుత్వం 2 నెలల కాలం నిర్ణయించగా, సుదీర్ఘకాలం పాటు విచారణ సాగి రెండు సార్లు విచారణ కాలం పొడిగించడమైనది. విచారణ పూర్తి చేసి సోమవారం విశాఖపట్నం పోలీసు కమిషనర్ ప్రభుత్వానికి అందజేశారు. విచారణలో వెలుగులోకి వచ్చిన విషయాలను బహిర్గతం చేసే వీలులేదు. వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దుటకు తగు చర్యలు ఈ నివేదికలో సూచించారు. సిట్‌లో పోలీసు, రెవెన్యూ, సర్వే డిపార్టుమెంట్ అధికారులు కలిసి విచారణ వేగవంతం చేశారు. నిష్పక్షపాతంగా, స్పష్టతతో, పారదర్శకంగా మరియు నిర్దుష్టంగా విచారణ చేసిన సిట్‌లోని అధికారులను అభినందించడమైనది.

# మాఘపౌర్ణమి జాతరకు ముస్తాబైన పూడిమడక



అచ్యుతాపురం: జిల్లాలోని అతిపెద్ద మత్స్యకార గ్రామమైన పూడిమడక మాఘపౌర్ణమి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు సర్పంచ్ మేరుగు కొండమ్మ బాపునాయుడు సోమవారం అన్నారు. ఈ జాతరకు జిల్లా నలుమూలల నుండి తోడపెద్దులు, తప్పెడ గుళ్ళు, బృందాలు, హరికీర్తనలు పాడుతూ మంగళవారం రాత్రి కాలినడకన వచ్చి తెల్లవార్లు సముద్రతీరం వద్ద సేవలు, భజనలు, హరికీర్తనలు పాడుతారు. తెల్లారిన తరువాత సముద్రంలో స్నానమాచరించి ఒడ్డున ఉన్న జగన్నాధస్వామిని దర్శించుకొని అక్కడే భోజనాలు తయారు చేససుకొని తిని వెళతారు. జిల్లా నలుమూలల నుండి లక్షపై చిలుకు పర్యాటకులు ఈ జాతరకు వస్తారు. ఈ జాతర సందర్భంగా డ్యాన్స్ బేబీ డ్యాన్స్, బురకథలు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసామని మేరుగు కొండమ్మ బాపునాయుడు తెలిపారు.

ఉచిత వైద్య శిభిరం: జాతర సందర్భంగా పర్యాటకులకు ఎటువంటి వ్యాదులు ప్రబల కుండా క్లోరినేషన్ చేసామన్నారు. అలాగే ఉఛిత మందుల పంపిణీ చేస్తామన్నారు. మంగళవారం ఉదయం నుండి బుదవారం సాయంత్రం వరకూ వైద్య శిభిరం నిర్వహిస్తామని అచ్యుతాపురం పిహెచ్సి వైద్యాదికారిని యోగితా బాల తెలిపారు.

పోలీస్ బందోబస్తు: పూడిమడక జాతరకు 120 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన గట్టి బందోబస్తు ఏర్పాటు చేసామని సిఐ విజయనాధ్ తెలిపారు. 2 సిఐలు, 9 ఎస్ఐలు, 39 హెచ్సిలు, 50 మంది పిసిలు, 16 లేడీ పిసిలు, 10 మంది గజ ఈతగాల్లు, 5 బోట్లు, స్పెషల్ పార్టీలు 4 బృందాలు ఏర్పాటు చేసామన్నారు.

ఆర్టిసి: 60 ఆర్టిసి బస్సులు అనకాపల్లి డిపో నుండి 20 బస్సులు, మద్దిలపాలెం, వాల్తేరు, గాజువాక తదితర డిపోల నుండి 40 బస్సులు తిప్పడం జరుగుతుందని అనకాపల్లి డిపో మేనేజర్ ఈ.ప్రవీణా అన్నారు. అలాగే నాలుగు రోడ్ల దగ్గర, అచ్యుతాపురం కూడలి దగ్గర టికెట్ పాయింట్ ఏర్పాటు చేసామన్నారు. పూడిమడక హైస్కూల్ దగ్గర తాత్కాలిక బస్ డిపో ఏర్పాటు చేస్తామన్నారు, అలాగే మంగళవారం ఉదయం నుండి బుదవారం సాయంత్రం వరకూ ఎటువంటి ప్రైవేట్ వాహనాలు అనుమతించ బడవని ఆమె తెలిపారు.

## శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి కళ్యాణమహోత్సవం

### ముఖ్య అతిధిగా తెలంగాణ స్పీకర్ మధుసూధనాచారి



సింహాచలం : సింహాచలం కొండాద్రిగువన గల పుష్కరిణి సత్రంలో శ్రీ పోతులూరి వీర్రబహ్మేంద్ర స్వామి కళ్యాణ మహొత్సవం కన్నుల పండుగగా అధిక సంఖ్యలో విశ్వబ్రాహ్మణ బక్తులు ఆధ్వర్యంలో జరిగినది. ముందుగా గణపతి పూజతో మొదలుపెట్టి శ్రీ వీర్రబహ్మేంద్రస్వామి గోవిందమాంబ కళ్యాణంలో భాగంగా జిలకర్రా బెల్లం, తలంబ్రాలు మొదలుగు కల్యాణతంతు జరిపారు. ఈ కార్యక్రమం శ్రీ కామాక్షి యార్క మమ్బరేశ్వర సనాతన ధర్మం పీఠం ఆధ్వర్యంలో ఊరూరా బ్రహ్మంగారు కార్యక్రమంలో బాగంగా స్వామి అమ్మవార్ల ఊరేగింపు ఉత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ స్పీకరు మధుసూదనాచారి పాల్గొని ప్రెత్యేక అకర్షణగా నిలిచారు. విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాలలో వెనకబడి వున్నారు అని అది గుర్తించిన సి ఎం కె సి ఆర్ తనకు స్పీకరు పదవి ఇచ్చి మనలను గుర్తించారని చెప్పారు. ఈ కార్యక్రమం సింహాచలం దేవస్థాన ఉద్యోగి సాంబమూర్తి అధ్వర్యంలో జరిగినది.

## వాడపల్లి వెంకన్న ఆదాయం 29 లక్షలు

రావులపాలెం : కోనసీమ తిరుపతిగా భాసిల్లుతున్న వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణాధికారులు సిహెచ్ ఉదయబాబు నాయుడు, వివివిఎస్ఎన్మూర్తి, పిటివి సత్యనారాయణమూర్తి ల ఆధ్వర్యంలో హుండియల్స్ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు.

ఆలయ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ల సమక్షంలో జరిగిన ఈ హుండియల్స్ లెక్కింపులో 34 రోజులకు గాను మెయిన్ హుండి ఆదాయం 27 లక్షల 99 వేల 141 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. ప్రధాన హుండీల ద్వారా 20 లక్షల 39 వేల 064 రూపాయలు రాగా అన్నదాన పథకం ద్వారా 7 లక్షల 60 వేల 141 రూపాయలురాగా 26 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి వచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిరామ్, శివ, తోటకూర సుబ్బరాజు, ఏపుగంటి రాజు, నాగేశ్వరరావు తదితరులతోపాటు గ్రామస్తులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 31న ఆలయం మూసివేత

రావులపాలెం : ఆత్రేయపురం మండలం, వాడపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఈ నెల 31న సంపూర్ణ చంద్రగహణం సందర్భముగా ఆలయంలో స్వామికి ఏకాంతంగా సేవలు జరిపి అనంతరం ఉదయం 8-30 నుండి మరునాడు ఉదయం 5 గంటలకు తెరుస్తామని ఆలయ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజులు తెలిపారు.

## చోరీ నిందితునికి జైలు శిక్ష

రావులపాలెం : 2015లో స్థానిక కోనసీమ ముఖద్వారం జై వీరహనుమాన్ కిరాణా షాపులో దొంగతనంపై షాపు యజమాని సత్తి రామగోపాలరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి ఎస్సై బి అప్పారావు కేసు నమోదు చేయగా సోమవారం పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాబూ జగజ్జీవనరావు వాదోపవాదాల మేరకు కొత్తపేట జ్యూడీషియల్ ఫస్టక్లాస్ మెజిస్ట్రేట్ వి.వెంకటేశ్వరరావు చోరీ సంఘటనపై నేరం ఋజువు కావడంతో నిందితునికి 2 నెలల 15 రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై సిహెచ్ విద్యాసాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జనవరి 8, 2015 న షాపు తాళాలు వేసుకొని వెళ్ళి మరుసటిరోజు ఉదయం షాపు తెరిచి చూసేటప్పటికి వెనుక తలుపు లు పగలుగొట్టి ఉండడం గుర్తించిన యజమాని 90 వేలు నగదు పోయిందని గుర్తించి పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేసారని, విచారణలో భాగంగా రాజానగరానికి చెందిన వేములపల్లి చిన్న దొంగతనానికి పాల్పడినట్లు తేలిందని, అతని వద్దనుండి 25 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## రూ. 2.50 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ లెట్రిన్స్ ప్రారంభం



ఆలమూరు : మండల పరిధి చింతలూరు ఎస్.సి.పేటలో రూ. 2.50 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ మరుగుదొడ్లను సోమవారం ఎంపిడిఓ నాతి బుజ్జి ప్రారంభించారు. గ్రామంలోని ఎస్.సి.పేటలో మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు స్థలములేని గృహస్తులకు పంచాయితీ, ఉపాధిహామీ సంయుక్త నిధులతో పంచాయితీ స్థలంలో ఇవి నిర్మించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి పి.బొజ్జిరాజు, సర్పంచ్ గెద్దాడ వెంకట నారాయణమూర్తి, ఉపసర్పంచ్ పెద్దింటి మంజుల, ఎంపిటిసి గుత్తుల విశ్వేశ్వరరావు, నూకాలమ్మ దేవాలయం ట్రస్ట్ ఛైర్మన్ వైట్ల శేషు, కార్యదర్శి పి.సత్తిబాబు, వార్డు మెంబరు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## "వాక్ విత్ జగనన్న" పాదయాత్రకు

### అధిక సంఖ్యలో తరలివెళ్లిన పార్టీశ్రేణులు



ఆలమూరు : రాష్ట్ర ప్రతిపక్ష నేత వై.యస్. జగన్మోహనరెడ్డి ప్రజా సంకల్ప యాత్ర 1000 కి.మీ. అధిగమించిన నేపద్యంలో సోమవారం నియోజకవర్గంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తలపెట్టిన వాక్ విత్ జగనన్న పాదయాత్రకు మండల గ్రామం ఆలమూరు నుండి రాష్ట్ర వైయస్సార్సిపి సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో కొత్తపేట తరలివెళ్లారు. అలాగే మండల వైయస్సార్సిపి కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల పరిధి పార్టీ శ్రేణులు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో చల్లా సత్యనారాయణ (నానాజీ), నాయుడు ప్రసాద్, కొపనాతి శ్రీనివాస్, డి.పి.రావు, ఎంపిటిసి కొండేటి పద్మశ్రీ, గాడా అన్నపూర్ణ, కోలా నాని, కొమ్మిశెట్టి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు ఫిట్జి చేయూత

విశాఖపట్నం : స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో భాగంగా ఫార్చునేట్ 40 పేరిట నిరుపేద విద్యార్థుల శిక్షణను అందించి ఐఐటి, జెఇఇ ఇతర టీ పరీక్షలలో టాప్ ర్యాంకులు అధించి తమ కలలు సాకారం చేసుకునేందుకు ఆర్థిక సహాయం అందించనున్న ఫిట్జీ సంస్థ డైరెక్టర్ ఆర్ ఎల్ త్రిక పేర్కొన్నారు. ఇతర వివరాలకు డబ్ల్యు, డబ్ల్యుడబ్ల్యు.ఫిట్జి.కామ్లో చూడగలరు.

## స్పందన కరువైన ప్రజావాణి

ఆలమూరు : స్థానిక తహశీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువైంది. ఈ కార్యక్రమంలో చెముడులంక గ్రామం నుండి వితంతు పెన్షను కోరుతూ-1 అర్జీ రాగా ఎంపిడిఓ నాతి బుజ్జి, ఈఓపిఆర్డి పి.బొజ్జిరాజు, హౌసింగ్ ఎఈ ఎస్.జేజిబాబు, ఆర్.డబ్ల్యు.ఎస్. జె.ఈ. ఎమ్.పోసమ్మ, మండల వ్యవసాయ విస్తరణాధికారి చిన్నం భువనేశ్వరి, ఏపిఓ ఏ.వి.రామారావు, మండల పంచాయితీలలో పనిచేస్తున్న కార్యదర్శులు 9మంది హాజరయ్యారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

నర్సీపట్నం : విద్యార్థులు మంచి ఉన్నత స్థాయికి ఎదగాలని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ డివి.రమణమూర్తి అన్నారు. సోమవారం పెదబడ్డేపల్లిలోని డాన్బాస్కోస్ కళాశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకోవాలనే ఆసక్తితో ఉన్న వారికి ఆకాశమే హద్దు అని పేర్కొన్నారు. విదేశాల్లో సైతం చదువుకోవడానికి ప్రభుత్వం ఉచితంగా చదివిస్తుందన్నారు. అయితే ఉన్నత స్థితిని ఎదగాలంటే మొదటి మెట్టు పదో తరగతిలో మంచి గ్రేడ్తో విద్యార్థినీ విద్యార్థులందరూ ఉత్తీర్ణులు అవడానికి పోటీపడాలన్నారు. ఉత్తేజంతో చదువు పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించుకోవడానికి ఇటువంటి సదస్సులు ఎంతో దోహదపడతాయన్నారు. సాంఘిక సంక్షేమం వసతి గృహాల్లో స్కూల్ బ్యాగులు మూడో తరగతి నుండి పదో తరగతి వరకు అందరి విద్యార్థులకు ప్రభుత్వం సరపరా చేసిందన్నారు. ప్రొఫిసర్లు, ఉపాధ్యాయ బృందం ఆశ్చర్యానికి గురయ్యాయని, మేము చదువుకునేటప్పుడు ఏమి లేదని తెలియజేయగా డిడి రమణమూర్తి చేరినప్పటి నుండి ప్రతీ సంవత్సరం ప్రత్యేకంగా ఏదో ఒక విద్యార్థులకు అవసరమైన వస్తువులు యోగా చేయడాన్ని చాపలు, తాగడానికి మంచి నీరు బాటిళ్లు, బాటాషులు, స్కూల్ బ్యాగులు సరఫరా చేయడాన్ని బట్టి విద్యార్థుల తల్లిదండ్రులు హర్షంవ్యక్తం చేయడం జరిగింది. ఈ సదస్సులో సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి కె.రామారావు, అవంతి ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫిసర్లు, ఉపాధ్యాయులు, నర్సీపట్నం, చోడవరం ఏఎస్డబ్ల్యూఒలు తెరుపల్లి సత్యనారాయణ, సిహెచ్.గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.




**మొదటి పేజీ తరువాయి**

## సాధికారతే మా మంత్రం

చేతుల్లోకి వెళ్లకుండా ఆపగలిగామన్నారు. దీంతో పాటు ముస్లిం మహిళల కోసం తీసుకొచ్చిన ముమ్మారు తలాక్ బిల్లు గురించి కూడా మాట్లాడారు. త్వరలోనే ముమ్మారు తలాక్ బిల్లు చట్టంగా మారుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అమరజవాన్ల త్యాగాలను రాష్ట్రపతి కొనియాడారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన జవాన్లకు నివాళులర్పించారు.

## 1000 కిలోమీటర్లు పూర్తయిన ప్రజాసంకల్పయాత్ర

పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో జననేతకు బాసటగా వాక్ విత్ జగన్ అంటూ వేలాదిమంది పాదయాత్రలతో ఉరకలెత్తారు. కాగా గత ఏడాది నవంబర్ 6న ఇడుపులపాయ వైఎస్ఆర్ ఘాట్ నుంచి వైఎస్ జగన్ ప్రజాసంకల్పయాత్రను ప్రారంభించిన విషయం తెలిసిందే.

## ఏసీబీ వలలో వుడా అధికారి

సాగుతున్నాయి. రాజమండ్రి, మైదుకూరులతో పాటు విశాఖలోని మధురవాడ, కిర్లంపూడి లేఅవుట్ లో ఓ అపార్ట్ మెంట్లు వెలుగుచూసినట్లు ఏసీబీ డీఎస్పీ ప్రసాద్ తెలిపారు.

***1984లో విధుల్లో చేరిన ప్రదీప్ కుమార్***

సిటీ అండ్ కంట్రీ ప్లానర్ విభాగంలో జాయింట్ డైరెక్టర్గా పనిచేస్తోన్న ప్రదీప్ కుమార్ రెండు వారాల క్రితమే వుడాలో చీఫ్అర్బన్ ప్లానర్గా బాధ్యతలు చేపట్టారు. తన ఇద్దరు కుమారులను విదేశాల్లో ఉన్నత చదువులు చదించారు. హెచ్.ఎస్. కనస్ట్రక్షన్స్ పేరుతో కుమారులు స్థిరాస్థి వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. అనంతపురంలో ఒక నివాస గృహం, హైదరాబాద్లో మామగారి పేరు మీద నివాస గృహం, స్నేహితుడి పేరు మీద విశాఖలో మరో నివాస స్థలం, భార్య పేరుమీద హైదరాబాద్లో నివాస స్థలం, తండ్రి పేరు మీద అనంతపురంలో మరో నివాస స్థలం, బావ పేరు మీద కూడా అనంతపురంలో నివాస స్థలం, పెద్దకొడుకు హేమంత సాయి పేరు మీద విశాఖలో నివాసస్థలం ఉన్నట్లు దాడులలో ఏసీబీ అధికారులు గుర్తించారు. తదుపరి దర్యాప్తు విషయమై పూర్తి విచారణ చేసి కోర్టుకు తరలిస్తామన్నారు.

## వ్యవసాయ అనుబంధ రంగాల్లో 25.6 శాతం వృద్ధి సాధించాం

ఇందుకు నిదర్శనమని ఆయన తెలిపారు. సోమవారం అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆవరణలో నిర్వహించిన కిసాన్ మేళా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని రైతులనుద్దేశించి ప్రసంగించారు. వ్యవసాయ రంగంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, యాంత్రీకరణను పెద్ద ఎత్తున అమలు చేస్తూ వ్యవసాయ రంగం సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు ప్రత్యేక బడ్జెట్ను కూడా ప్రవేశపెట్టిందన్నారు. విశాఖలో ఎగ్రిటెక్ సదస్సును భారీ స్థాయిలో నిర్వహించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగంలో వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. వ్యవసాయ రంగంలో పరిశోధనకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. వ్యవసాయ రంగంలో పరిశోధనలపై ప్రతీ ఏటా రూ. 40 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో మౌలిక వసతుల కల్పనకు, లేబొరేటరీల నిర్మాణానికి రూ. 282 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ. 500 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యాన పంటల అభివృద్ధికి చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. బిందు, తుంపర సేద్యాభివృద్ధికి కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. బిందు, తుంపర యూనిట్ల తయారీ కంపెనీలతో ఈ నెల 31న విజయవాడలో భారీ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికై రైతులకు రుణ మాఫీ చేయడం జరిగిందని, అర్హులైన రైతులకు మిగిలిన వారికి ఇది వర్తింపజేస్తామన్నారు. భూసార పరీక్షల్లో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందన్నారు. అత్యాధునిక వంగడాల అభివృద్ధికి ఉత్పత్తులను గణనీయంగా పెంచడం జరుగుతుందన్నారు. కర్నూలు జిల్లాలో రూ. 650 కోట్లతో 600 ఎకరాల్లో మెగా సీడ్ పార్కును అభివృద్ధి పరుస్తున్నామన్నారు. ఇందుకు అనుగుణంగా విత్తన అభివృద్ధి సంస్థలను నమూనాల ప్లాంట్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వరి దిగుబడులు పెంచేందుకు పెద్ద ఎత్తున రాయితీలు ఇస్తున్నామన్నారు.

***రూ. 2 కోట్ల ఆస్తుల పంపిణీ .. పలు భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు***

అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో రూ. 8.70 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు మంత్రి శంకుస్థాపన చేశారు. షుగర్ కేన్ రీసెర్చి ఎక్సలెన్స్ సెంటర్, అడ్వాన్సడ్ పోస్టు హార్వెస్ట్ టెక్నాలజీ రీసెర్చ్ సెంటర్, ప్రీమియర్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, పౌడర్ బయోఫెర్టిలైజర్ యూనిట్ల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. అంతేగాక నూతనంగా నిర్మించిన జీవన ఎరువుల విభాగాన్ని మంత్రి ప్రారంభించారు. పలు రాయితీలపై రైతులకు రైతు రథాలను మంత్రి పంపిణీ చేశారు.

ఈ సమావేశంలో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతు రుణ మాఫీ విషయంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచిందన్నారు. రైతులకు అనేక రుణాలు కల్పించి, రుణ మాఫీలు అమలు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోనున్న తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరించేందుకు ప్రభుత్వం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అనకాపల్లి శాసనసభ్యుడు పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ చెరకు విత్తనాలు రాయితీపై రైతులకు అందజేయాలని, బీమా సౌకర్యాన్ని రైతులకూ వర్తింపజేయాలని, బెల్లం పౌడర్ యూనిట్ల స్థాపనకు ప్రభుత్వం చేయూనివ్వాలని వ్యవసాయ మంత్రికి విజ్ఞప్తి చేశారు.

అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఉప కులపతి దామోదరు నాయుడు మాట్లాడుతూ రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేసేందుకు తమ కేంద్రం కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమగ్ర సస్య రక్షణపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

జిల్లా పరిషత్ చైర్పర్సన్ లాలం భవాని, చోడవరం శాసనసభ్యుడు కెఎస్ఎన్ రాజు, జాయింట్ కలెక్టర్-2 ఎ. సిరి, పరిశోధనా కేంద్రం డైరెక్టర్ నాయుడు, అసోసియేట్ డైరెక్టర్ కృష్ణ ప్రసాద్, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు పి. శివప్రసాద్ (విశాఖ), లీలావతి (విజయనగరం), రామారావు (శ్రీకాకుళం) తదితరులతో పాటు పశు సంవర్ధక శాఖ, ఉద్యానవన శాఖ సహాయ సంచాలకులు తదితరులతో పాటు రైతులు పెద్ద ఎత్తున ఈ మేళాలో పాల్గొన్నారు.

## కాపు రిజర్వేషన్లపై ప్రైవేట్ బిల్లు

అనుమతి మంజూరైనట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాదయాత్ర సమయంలోనే కాపుల కష్టాలను చూసి బీసీలకు నష్టం లేకుండా రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆయన అన్నట్లే కమిషన్ వేసి నివేదిక వచ్చిన 48 గంటల్లోనే అసెంబ్లీలో బిల్లును ఆమోదింపజేసిన ఘనత ముఖ్యమంత్రికే చెందుతుందన్నారు. ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు కోరుతూ లోక్సభలో పెడుతున్న ఈ బిల్లుకు రాజకీయాలకు అతీతంగా అందరూ మద్దతు ఇవ్వాల్సిన అవసరముందన్నారు. ఇందుకోసం వె%కాపాతో పాటు అన్ని పార్టీల నాయకుల్ని కలిసి కాపుల పరిస్థితిని వివరిస్తామన్నారు. ఈ సమావేశాల్లో బిల్లు ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆక్రమణలు నిలిపివేత

భీమునిపట్నం: స్థానికి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం నకు సంబంధించి టి.యస్.నెం. 1093 లో సుమారు తొమ్మిది ఎకరాల భూమి నందు యున్న ఆక్రమణదారులు నివాసాలు కట్టటానికి ప్రయత్నం చేస్తున్న వారిని దేవాదాయశాఖ అడ్డగించి ఆ స్థలం లో జరుగుతున్న పనులను ఆపారు దేవాదాయశాఖ సంబంధించిన స్థలం లో ఎటువంటి ఆక్రమణలకు ప్రయత్నం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దేవాదాయ ధర్మాదాయశాఖ డి.సి. ఎన్.వి.ఎస్.ఎన్.మూర్తి అన్నారు. ఇందులో భీమిలి వి.ఆర్.ఓ. మంత్రిప్రగడ. వీర్రాజు, ఇన్ స్పెక్టర్ ఎం.శ్రీధర్, శేఖర్ బాబు, శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవాలయం ఇ.ఓ కీర్తి.శ్రీనివాసరావు సిబ్బంది పి. రాంబాబు, కె.శ్రీను, ఆలయ అర్చకులు రొంపిచెర్ల. సింగారాచార్యులు, ప్రసాద్ ,కృష్ణమాచార్యులు, పాల్గొన్నారు

## పెద్దలను గౌరవించాలి

రావులపాలెం: వృద్దులను, పెద్దలను గౌరవించడం సాంప్రదాయం, అదే బాటలో రావులపాలెం, ఆలమూరు సిద్దార్థ మాజమాన్యం ఆధ్వర్యంలో స్కూలు విద్యార్థులు సోమవారం సిఆర్సి ఓల్జేజ్ హెూమ్ సందర్శించి వృద్దులు పెద్దలను గౌరవించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భముగా విద్యార్థులు వృద్దులకు, పండ్లు బిస్కెట్లు, బ్రెడ్ లు అందజేసి వారి ఆశీర్వచనాలు పొందారు.

ఈ కార్యక్రమంలో సిఆర్సి ఓల్జేడ్ హెూమ్ అధ్యక్షులు మల్లిడి కనికిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మేటివ్-1 పై సమీక్షా సమావేశం

రావులపాలెంట స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి బొజ్జా రమణశ్రీ అధ్యక్షతన 10వ తరగతి సమ్మేటివ్-1 పై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో సి, డి గ్రేడ్ విద్యార్థులకు తీసుకోవలసిన ప్రణాళిక, ఇ హాజరు, డిజిటల్ తరగతుల నిర్వహణ, ఉపాధ్యాయులు ఏవిధంగా అంకిత భావంతో పనిచేయాలి విలువైన సలహాలు సూచనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎమ్. సుబ్బరాజు, టి. వెంకటరెడ్డి, భమిడిపాటి సాయిరాం, పి. సంధ్యారాణి, రావులపాలెం, కొత్తపేట, ఆత్రేయపురం మండలాల ఇంగ్లిష్, తెలుగు, హింది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలిస్తున్న సంస్కరణలు



విశాఖపట్నం: నగర పాలక సంస్థలు, మునిసిపాలిటీల్లో సంస్కరణలు అమలు చేస్తున్నామని అవి మంచి ఫలితాలు ఇవ్వడంతో సంస్కరణలు అమలు చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. సోమవారం జివిఎంసి కార్యాలయంలో సంస్థ చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని నగర పాలక సంస్థలు, మునిసిపాలిటీల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న దస్త్రాలను మార్చి 31 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు మంచి సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఆన్‌లైన్ సేవలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కొన్ని మునిసిపాలిటీల్లో ప్లాన్‌లు మంజూరు చేయడంలో లంచాలు తీసుకుంటున్నారని, దానిని అరికట్టేందుకే ఆన్‌లైన్ సేవలు అమలు చేశామని అన్నారు.

ఈ సమావేశంలో నగర శాసనసభ సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, విష్ణుకుమార్ రాజు, పల్లా శ్రీనివాస రావు, బండారు సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### జగన్ పాదయాత్రకు మద్దతుగా

# విశాఖలో వంశీకృష్ణ శ్రీనివాస్ పాదయాత్ర

విశాఖపట్నం: గ్రేటర్ విశాఖ తూర్పు నియోజకవర్గం వైకాపా ఇన్‌చార్జి వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు 800 మందితో జగన్ పాదయాత్రకు మద్దతుగా అభిమానులు, కార్యకర్తలతో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా జగనన్నకు జేజేలు పలికారు. రాష్ట్ర ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర 1000 కిలో మీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వైకాపా తూర్పు నియోజకవర్గం 7వ వార్డులోగల ఎల్లమ్మగుడి వాసవానిపాలెం మీదుగా అప్పునగర్ రోడ్డు, సమతా కాలేజి మీదుగా కేన్సర్ హాస్పిటల్ జంక్షన్ వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ యాత్ర ఉదయం 9 గంటలకు ప్రారంభించి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సాగింది. ఈ పాదయాత్రలో ఇంటింటికీ వెళ్లి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర గురించి, నవరత్నాల పథకం గురించి విపులంగా వివరించడం జరిగింది. జగన్ మోహన్ రెడ్డికి జైజై అంటూ పార్టీ నినాదాలతో పాదయాత్ర మారుమోగిపోయింది. జగన్ మోహన్ రెడ్డి విశాఖపట్నం ఎపుడు వస్తారా అని అభిమానులంతా ఆతృతగా ఎదురుచూడసాగారు. ఈ కార్యక్రమంలో పేర్ల విజయచంద్ర, మెల్లి అప్పారావు, కొయ్యి ప్రసాదరెడ్డి, ఫరూకీ, నడింపల్లి కృష్ణంరాజు, గొలగాని శ్రీను, పతివాడ కనకరాజు, వాసుపల్లి యల్లాజీ, ఆకెళ్ల రమణమూర్తి, ఎ. గిరిబాబు, గుడ్ల గణేష్ రెడ్డి, ముగడ సురేష్, పలకిల నీలరెడ్డి, కమల్, నక్కెళ్ల త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.



### వైభవంగా ఆర్‌ఈసీఎస్ చైర్మన్

# మలసాల ప్రమాణ స్వీకారం



అనకాపల్లి : ప్రతిష్ఠాత్మకమైన ఐదు మండలాల పరిధిలో సహకార రంగంలో విద్యుత్ సేవలందిస్తున్న కశింకోట ఆర్‌ఈసీఎస్ చైర్మన్‌గా మలసాల రమణరావు పదవీ ప్రమాణ స్వీకారం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా రమణారావు సొంత గ్రామమైన అమిన్‌సాయిబుపేట (ఎఎస్‌పేట) గ్రామం నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీగా ఆర్‌ఈసీఎస్ కార్యాలయానికి చేరుకున్నారు. అలాగే జిల్లా నలుమూలల నుండి అనూహ్య రీతిలో తరలివచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో రమణారావు ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. ఆర్‌ఈసిఎస్ వ్యవస్థాపకులు దివంగత మాజీ శాసన సభ్యులు పీవీ రమణరావు పేరును ఈ సంస్థకు నామకరణ చేయాలని అనకాపల్లి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సభా ముఖంగా ప్రతిపాధించిగా స్థానిక ఎంపి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిల ఈ ప్రతిపాదనకు తమ ఏకగ్రీవ ఆమోదాన్ని ప్రకటించారు. అనంతరం చైర్మన్ రమణారావు మాట్లాడుతూ ఆర్‌ఈసిఎస్ లో ఉన్న దీనదయాల్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యువజన పథకం ద్వారా మరింత సేవలు విస్తృతం చేస్తామన్నారు. సంస్థ పరిధిలో 17 నెంబర్లతో లివన్‌కేబి పీడర్ల సైకింగ్ చేయుటకు మూడు కోట్లతో త్వరలో పనులు చేపడతామన్నారు. మునగపాక, చూచుకొండ గ్రామాల్లో 20 లక్షలతో నూతన సెక్షన్ కార్యాలయాలను నిర్మించి ఎనిమిది వేల మంది వినియోగదారులకు మరిన్ని సేవలు అందుతాయన్నారు. కాగిత రహిత పాలనలలో భాగంగా మొదటి విడతగా అగనంపూడి, లంకెలపాలెం, పరవాడ సబ్బవరం, సెక్షన్ కార్యాలయాల పరిధిలో 60 వేల మంది వినియోగదారులకు ఆన్‌లైన్ ద్వారా కరెంట్ బిల్లులు చెల్లించే విదంగా, 25 లక్షలతో ఈ పథకం ప్రారంభిస్తున్నామన్నారు. అనకాపల్లి మండలం కొప్పాక గ్రామంలో 30 లక్షలతో సెక్షన్ కార్యాలయం నిర్మించి 10 వేల మంది వినియోగదారులకు సేవలు అందిస్తామన్నారు.

తుమ్మపాల సెక్షన్ కార్యాలయాన్ని 15 లక్షలతో ఆదునీకరణ పనులు చేస్తామన్నారు. సంస్ద ప్రధాన కార్యాలయంలో ఎమ్మార్పీ కార్యాలయానికి 12 లక్షలతో అభివృద్ధి పనులు చేపడతామని, ఆర్‌ఇసిఎస్ సంస్ద పరిధిలో చదువుతున్న పాల్‌టెక్నిక్ విద్యార్దులకు 10 లక్షలతో వర్క్‌షాపు భవన నిర్మాణం, 25 లక్షలతో రెండు ఆదునిక ప్రయోగసాలలు, అదనపు తరగతి గదులు నిర్మిస్తాన్నారు. మలసాల రమణారావు దంపతులను ఎంపి అవంతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పీలా గోవింద్, బండారు సత్యనారాయణమూర్తి, జెడ్పీ చైర్‌పర్సన్ లాలం భవానీ తదితరుతలు గజమాలతో సత్కరించారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.


ఈ కార్యక్రమంలో ఎంపిపి, పంచదార్ల లక్ష్మి, ఎఎంసీ చైర్మన్ కాయల మురళీ, వేగి గోపీకృష్ణ, డీసీసీబి డైరెక్టర్ చిదిరెడ్డి శ్రీనివాసరావు, జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్సి మలసాల కుమార్‌రాజా, డిసిసీబీ చైర్మన్ సుకుమార్ వర్మ, లాలం భాస్కరరావు, యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పీలా రమాకుమారి, అనకాపల్లి ఎంపిపి కొణతాల వెంకటసావిత్రి, ఎంపిడివో శ్రీనివాసరావు, పిఈ జుత్తాడ ప్రసాదరావు, ఆర్‌ఇసిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





ప్రజాసంకల్ప పాదయాత్రలో 1000 కిలోమీటర్లు పూర్తిచేసుకున్న ప్రతిపక్షనేత వైస్ జగన్మోహన్ రెడ్డి గారికి సంఘీభావంగా ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండా రాజీవ్ గాంధీ ఆధ్వర్యంలో భారీ 300 మందికి పైగా జన సందోహంతో పాదయాత్ర నిర్వహించారు. ప్రసాద్ గార్డెన్స్ , పాండవీధి కల్లుపాకలు పూర్ణామార్కెట్ కలుపుకుంటూ ప్రధాన కుడలాల్లో పాదయాత్ర నిర్వహించారు. మార్గమధ్యలో ఉన్న వైఎస్ ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసారు. ఈ పాదయాత్రలో ప్రజలను కార్యకర్తలను ఉద్దేశించి కొండా రాజీవ్ గాంధీ ప్రసంగిస్తూ యువతకి ఉపాధి అవకాశాలు కేవలం జగన్ మోహన్ రెడ్డి గారి వల్లే సాద్యమవుతుందని, అయన వచ్చాక గ్రామా సెక్రటేరియట్ ల ద్వారా యువతకి 1 , 20 ,000 ఉద్యోగాలు వస్తాయని దాని ద్వారా ఏ సమస్యకైనా 72 గంటల్లో పరిష్కార మార్గం చూపిస్తారని ఇంకా మరెన్నో రాబోవు పథకాల గురుంచి వివరించారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి , శంకరరావు , బండి దేముడు, బాదంపూడి వాసు, శ్రీను రెడ్డి , రెడీనం మహేష్, సీతారెడ్డి, భవాని, రాజు, కృష్ణ, అనిల్ , సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సాగరతీరంలో ఫిబ్రవరి 3న హనుమాన్ చాలీసా పారాయణ



విశాఖపట్నం : ప్రకృతి శాంతికై విశాఖ సాగరతీరాన ఫిబ్రవరి 3న శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్టు దత్తపీఠాధిపతి ఆశ్రమం ప్రతినిధి తాడేపల్లి రమేష్ చెప్పారు. ద్వారకా నగర్‌లోని ఓ హాటల్‌లో ఆది వారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆశ్రమ ప్రతినిధులు, కార్యసిద్ధి హను మాన్ సేవా సంఘం ప్రతినిధులు మహా యజ్ఞం బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సంధర్భంగా రమేష్ మాట్లాడుతూ దత్తపీఠాధిపతి జగద్గురు శ్రీగణపతి సచ్చిదానంద స్వామిజీ మహాసంకల్పంతో రామకృష్ణబీచ్‌లో ఫిబ్రవరి 3వ తేది సాయంత్రం నాలుగు గంటల నుంచి పారాయణ మహాయజ్ఞం ప్రారంభం అవు తుందన్నారు. మహా యజ్ఞంలో బాగంగా పర్యావరణాన్ని శాంతింప చేయటానికి సకాలంలో వర్షాలు పడటానికి వాతావరణం సమతుల్యంగా వుండటానికి నగరంలో 50వేల మొక్కలను నాటుతున్నట్టు పేర్కొన్నారు. ఫిబ్రవరి 4న విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ప్రకృతిపులకించేలా స్వామిజీ స్వయంగా సంగీత నాధ చికిత్స కచేరి చేయనున్నారని చెప్పారు.

మీడియా సమావేశంలో స్వామిజీ ఆశ్రమం ప్రతినిధులు దుర్గాప్రసాద్, కోఆర్డనేటర్ పరిమిగిరి, కార్యసిద్ధి హనుమాన్ సేవా సంఘం ప్రతినిధులు ఎం అప్పారావు, కె అప్పలనాయుడు, సిహెచ్ కృష్ణప్రసాద్, తిరుపతిరావు తదితర్లు పాల్గొన్నారు.

# హత్య కేసు దర్యాప్తు వేగవంతం ..

- హత్య కేసులో ఏడుగురు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు బావిస్తున్న పోలీసులు ...
- నిందితులు హత్య సమయంలో రెండు కార్లు ఉపయోగించి నట్లు అనుమానం ....
- ఇటువంటి నేరాలపై నిఘా పెట్టిన పోలీసులు


విశాఖ క్రైం: నగరం సంచలనం సృష్టించిన యోగా టీచర్ హత్య కేసు సంబందించి పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే కొంత మంది వివరాలు సేకరించినట్లు సమాచారం. హత్య కేసులో ఏడుగురు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు పోలీసులు బావిస్తున్నారు.

పాలమర శెట్టి వెంకట రమణను హత్య చేసిన సమయంలో నిందితులు అనకాపల్లి వైపుగా ప్రయాణించారని తెలుసుకున్న పోలీసులు హత్య సమయంలో రెండు కారులు ఉపయోగించి ఉంటారని భవిస్తూ ఆసమయంలో అనకాపల్లి వైపుగా ప్రయాణించే వాహనాల వివరాలు టోల్ ప్లాజా వద్ద సేకరించి అదిసగా దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. హత్య కేసులో ప్రధాన నిందితునిగా వున్న కిలపర్తి వెంకట రమణ ప్రస్తుతం కేజీహెచ్‌లో కోలుకుంటున్నాడని అతడు పూర్తి స్థాయిలో కోలుకుంటే మరింత సమాచారం తెలుసుకునే అవకాశం ఉంది.


హత్య కేసులో కీలకంగా వ్యవహరించిన అజైకుమార్ ప్రస్తుతం పరారీలో ఉండటంతో అతడిని పట్టుకునే పనిలో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. హత్య కేసులో సంబంధముందని బావిస్తున్న గొపాలపట్నం ప్రాంతానికి చెందిన కోటి అనే వ్యక్తి గురించి పోలీసు అరా తీస్తున్నట్లు తెలుస్తుంది.




ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కిలపర్తి వెంకట రమణ



హత్య కేసులో కీలక ముద్దాయి అజయ్ కుమార్



మరోపక్క ఇంటువంటి నేరాలకు పాల్పడిన పాత నిందితుల కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు వారిపైన ధృష్టి సారించారు. ఈ కేసులో సంబంధమున్న నిందితులని త్వరిత గతిన అదుపులోనికి తీసుకుంటామని ఎయిర్ పోర్ట్ సి.ఐ మళ్ల శేషు తెలిపారు.

# విజయభాను సంపాదకీయం

## ఆకట్టుకున్న ప్రసంగం

అమెరికాకు ప్రత్యామ్నాయంగా తామున్నామని చైనా అధినేత జిన్‌పింగ్ బహిరంగంగానే అంటున్నారు. అయినప్పటికీ చైనా రాజకీయ- ఆర్థిక వ్యవస్థ ప్రపంచ దేశాలకు ఆమోదయోగ్యంగా లేదు. ఈ కారణంగానే మోదీ ప్రసంగం సభికులను ఆకట్టుకున్నది. భారత్ పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రమంటూ మోదీ వివరించిన తీరు గమనార్హమైనది. ఇక్క డ రాజకీయ సుస్థిరత ఉంటుందనీ, సంపదను సంక్షేమాన్ని, శాంతిని సౌభాగ్యాన్ని పొందవచ్చునని వివరించారు. వసుధైక కుటుంబమన్న భారతీయ భావనను బలంగా వినిపించారు. ఇక్కడ ప్రజాస్వామ్యం ఉన్నదనీ, ప్రజలు అనుకూలురని వివరించారు. అమెరికా తదితర పాశ్చాత్య దేశాలు వ్యాపార రంగంలో రక్షిత విధానాలను అనుసరిస్తున్న కాలంలో, భారత ప్రధాని మోదీ దావోస్ వేదికపై నుంచి ప్రపంచీకరణ విధానాలను పరిరక్షించుకుందామంటూ పిలుపునిచ్చి ప్రశంసలు అందుకున్నారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపం చ ఆర్థిక వేదిక సమావేశాల్లో మంగళవారం మోదీ ప్రసంగం విన్న ప్రముఖులకు భారత్ ప్రాభ వం మొదలైందన్న అభిప్రాయం కలిగింది. దావోస్ వేదికపై నుంచి మోదీ భారత్‌ను పెట్టుబడులకు తగిన గమ్యస్థానంగా వివరిస్తూనే, ప్రపంచానికి మూడు సూచనలు చేశారు. వాతావరణ మార్పు, ఉగ్రవాదం, వ్యాపార రక్షిత విధానాలు మూడు ప్రపంచానికి చేటు అని ఆయన హెచ్చరించారు. అమెరికా వాతావరణ మార్పువాదాన్నే అంగీకరించకుండా ప్యారిస్ ఒడంబడిక నుంచి వైదొలుగడం గమనార్హం. ఈ దశలో మోదీ ప్రపంచ దేశాలన్నీ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. తాము పర్యావరణ హితమైన వ్యాపారాన్ని ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, ఇందుకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పాశ్చాత్య దేశాలు ఇవ్వడం లేదని ఆయన గుర్తు చేశారు. ప్రపంచీకరణ క్రమం ప్రశ్నార్థకమవుతున్న తీరును ఆయన ఆక్షేపించారు. ఇటీవలి కాలంలో బహుళ పక్ష చర్చలు నిలిచిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. ట్రంప్ ఇటీవలి కాలంలో ఉమ్మడి వ్యవస్థల పట్ల కినుక వహించడం పట్ల ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంచి ఉగ్రవాదం, చెడు ఉగ్రవాదం అంటూ ఉండదనీ, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ప్రమాదకరమని హితవుచెప్పారు. ఇది పాకిస్థాన్‌ను తప్పుబట్టినట్టు కనిపిస్తున్నప్పటికీ, పశ్చిమాసియాలో అమెరికా విధానాలు కూడా ఇందుకు భిన్నంగా లేవు. ప్రధాని మోదీ ప్రసంగం పట్ల చైనా హర్షం వ్యక్తంచేసింది. చైనా మీడియా మోదీ ప్రసంగాని కి విశేష ప్రాధాన్యం ఇచ్చింది. ప్రపంచీకరణ వర్తమాన ప్రపంచ పోకడనీ, దీనివల్ల వర్ధమాన దేశాలతో పాటు అన్నిదేశాలు లబ్ధి పొందుతాయనీ, రక్షిత విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల ని మోదీ ప్రసంగాన్ని బట్టి అర్థమవుతున్నదని చైనా అధికార ప్రతినిధి హువా చున్‌యింగ్ అన్నా రు. భారత్‌తోసహా అన్ని దేశాలతో కలిసి ప్రపంచీకరణను ముందుకు తీసుకుపోవాలని, తద్వా రా అన్నిదేశాల వృద్ధికి తోడ్పడాలని చైనా భావిస్తున్నది అని ఆమె సౌహార్ద్రతను వ్యక్తం చేశా రు. అంతర్జాతీయరంగంలో పాశ్చాత్య దేశాల విధానాలకు వ్యతిరేకంగా భారత్, చైనా ఏకతాటిపై నిలువడం ఇవాళ కొత్త కాదు. వర్ధమాన ఆర్థిక వ్యవస్థలుగా భారత్, చైనా దేశాలకు ఉమ్మడి ప్రయోజనాలున్నాయి. భారత్ తూర్పు ఆసియా కూటమిలో, షాంఘై సహకార సంస్థ లో చేరుతున్నప్పుడు చైనా పెద్దగా అడ్డుచెప్పలే దు. ప్రపంచ వాణిజ్య సంస్థతోపాటు పలు బహుళ పక్ష వేదికలపై రెండు దేశాలు సహకరించుకుంటున్నాయి. జీవవైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణమార్పు, బ్రిక్స్ సహకా రం మొదలైన అంశాల్లో ఉమ్మడి లక్ష్యాలున్నా యి. భారత్, చైనా సహకరించుకుంటే బలమైన కూటమి అవుతుంది. కానీ ఇందులో కొన్ని చిక్కులు కూడా ఉన్నాయి. అయితే చైనాతో సరిహద్దు సమస్యతో పాటు ఇతర విభేదాలు కూడా ఉన్నాయి. హిందు మహాసముద్రంలో ప్రాబల్యం కోసం చైనా ప్రయత్నించే క్రమంలో పోటీ ఎదురవుతుంది. అయితే భారత్ తన ప్రాబల్యాన్ని పెంచుకోవడం ద్వారా మాత్రమే చైనా ను కట్టడిచేయగలదనే సూచన వినబడుతున్నది. భారత్ బలోపేతం అయితే చైనా సర్దుకుపోక తప్పదు. భారత్ చైనా రెండూ ప్రపంచీకరణ అనుకూల విధానాలు అనుసరిస్తున్నాయి. చైనా అధినేత జి జిన్‌పింగ్ గతేడాది దావోస్ వేదికపై నుంచి ప్రసంగిస్తూ, ప్రపంచీకరణను ముందుకు తీసుకు పోవాలని పిలుపునిచ్చారు. ఈ సారి మోదీ ప్రసంగం కూడా దాదాపుగా అదే బాటలో ఉన్నది. అయినప్పటికీ మోదీ ప్రసంగానికి వచ్చినంత స్పందన జిన్‌పింగ్‌కు రాలేదు. అమెరికా రక్షిత విధానాలు అనుసరించడం, యూరప్ ఏకతాటిపై నిలువలేకపోవడం వల్ల ప్రపంచమంతా మరో శక్తి కేంద్రంపై వైపు చూస్తున్నది.

# 25న జిఎస్ఐబి ప్రవేశ పరీక్ష

## జాయింట్ డైరక్టర్ ప్రొఫెసర్ కె.కె.నారాయణన్

విశాఖపట్నం: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ (జిఎస్ఐబి) లో 2017-18 విద్యా సంవత్సరానికిగాను ఎంబిఎలో ఇంటర్నేషనల్ బిజినెస్, గ్లోబల్ లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ స్పెషలైజేషన్‌లకు అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు జిఎస్ఐబి జాయింట్ డైరక్టర్ ప్రొఫెసర్ కె.కె.నారాయణన్ తెలిపారు. వీటితో పాటు అపార ఉపాధి అవకాశాలు గల బిజినెస్ అనలటిక్స్ లో ప్రఖ్యాత ఐటి సంస్థ ఐబిఎమ్ తో కలసి పీజీ డిప్లొమా కోర్సును నిర్వహిస్తున్నామన్నారు. ఈ కోర్సులలో ప్రవేశం పొందగోరే వారు ఏదైనా డిగ్రీలో ద్వితీయ శ్రేణి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారై ఉండాలి. బిజినెస్ అనలటిక్స్ పీజీ డిప్లొమా కోర్సులో ప్రవేశం పొందగోరే వారికి రాత పరీక్ష ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.ఈ ఏడాది ఫిబ్రవరి 25 వ తేదీనా జిఎస్ఐబి ప్రవేశ పరీక్షను దేశవ్యాప్తంగా ముఖ్య పట్టణాలలో నిర్వహిస్తామన్నారు.పూర్తి వివరాలను, ధరఖాస్తులను గీతం వెబ్‌సైట్ www.gsib.org నుంచి పొందవచ్చున న్నారు.పూర్తి చేసిన ధరఖాస్తులను ఫిబ్రవరి 20వ తేదీలోగా అందజేయాలని సూచించారు.

రాత పరీక్ష అనంతరం గ్రూప్ డిస్కషన్, వ్యక్తిగత ఇంటర్వ్యూ ఉంటుంది. పై అర్హతలతో పాటు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలు అయిన క్యాట్, మ్యాట్, జీమాట్, సీమాట్, ఎక్స్ఏటి లలో ర్యాంకు సాధించిన వారికి నేరుగా ప్రవేశాలు కల్పిస్తారు.

పూర్తి వివరాలను గీతం వెబ్‌సైట్ www.gsib.org నుంచి పొందవచ్చు.

ఎంబిఎ కోర్సును అభ్యసించే విద్యార్థులను గ్లోబల్ మేనేజర్‌లుగా తీర్చిదిద్దటానికి అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నామన్నారు. ప్రముఖ కంపెనీలలో జిఎస్ఐబి విద్యార్థులకు అవకాశాలు లభించాయని తెలిపారు. అమెరికా లోని వర్జీనియా ఐ ల్యాండ్స్ విశ్వవిద్యాలయం తో పాటు చికాగోలోని నార్తన్ ఇల్లినాయిస్ విశ్వవిద్యాలయం దక్షిణాఫ్రికా లోని రీజెంట్ బిజినెస్ స్కూల్ లతో బోధన, పరిశోధన కు అవసరమైన అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారు చేయడానికి రెన్‌బి సొల్యూషన్స్ సంస్థతో కలసి జిఎస్ఐబి-రెన్‌బి ఇంక్యుబేటర్‌లో గీతంలో ఏర్పాటు చేశామన్నారు.

# ఘనంగా శ్రీ నిత్యానంద త్రయోదశి



విశాఖపట్నం: 2018 జనవరి 29 వ తేదీన శ్రీ నిత్యానంద జయంతి ఉత్సవాలను హరే కృష్ణ మూవ్ మెంట్ సంస్థ వారు వుడా చిల్డ్రన్ థియేటర్ నందు అత్యంతఘనంగా నిర్వహించారు. ద్వాపరయుగంలోని బలరామ భగవానుడే నిత్యానంద ప్రభువుగా అవతరించారని శాస్త్రంలో వర్ణించబడింది.

500 సంవత్సరాల క్రితం పశ్చిమ బెంగాల్ లో శ్రీ కృష్ణచైతన్య మహాప్రభువు యొక్క సహచరుడిగా ఆయన అవతరించారు. వీరిద్దరూ కలసి హరే కృష్ణ మహామంత్రం తో కూడిన హరినామ సంకీర్తనన్నాన్ని ప్రచారంచేసి భారతదేశం అంతటా భక్తీ ఉద్యమంలో ప్రభంజనం సృష్టించారు. కుల మత వర్గ తారతమ్యాలతో కూడిన ఆనాటి సమాజంలో సృష్టిలోని ప్రతి ఒక్కరు ఆత్మ స్వరూపులమని, భగవంతుని అంశలము కాబట్టి భగవంతుణ్ణి సేవించుటకు అందరికీ సమాన హక్కు ఉందని వారు భోదించారు. వీరి భోదనలను ప్రపంచవ్యాప్తంగా అనేక యూనివర్సిటీలలో ఇండోలాజీ విభాగంలో పాఠ్యఅంశాలుగా చేర్చటం జరిగింది.

శ్రీ నిత్యానంద భగవంతుని దివ్య ఆవిర్భావదినోత్సవము సందర్భముగా హరే కృష్ణ మువే మెంట్ భక్తులు స్వామివారికి సాయంత్రం 6.30 ని లకు మహాభిషేకం (నిత్యానంద శ్రీ కృష్ణ చైతన్య మహా ప్రభువులకు) సప్తనదుల నుంచి ( గంగ, యమునా, గోదావరి, సరస్వతి, నర్మదా, సింధు, కావేరి) సేకరించి, పవిత్ర జలాలు నింది ఉన్న 108 కలశాలతో, పంచామృతం, పంచగంధ్య, సువాస నలతో కూడిన పుష్పాలు మరియు వివిధ రకాల పండ్లరసాలతో ఘనంగా మహాభిషేకం నిర్వహించారు. భక్తులు అందరూ హరే కృష్ణ సంకీర్తనలో పాల్గొని ఆనంద పారవశ్యంతో తన్మయులయ్యారు. ఉత్సవాలలో భాగంగా స్వామివారికి విశేషంగా 58 రకాల పిండివంటలతో నైవేద్యం జరిగిన తర్వాత భక్తులందరికీ మహాప్రసాదవితరణ జరిగింది.



శ్రీ నిష్కించిన భక్త దాస ప్రెసిడెంట్ హరే కృష్ణ మూవ్మెంట్, విశాఖపట్నం వారు భక్తులకు శ్రీ నిత్యానంద ప్రభు ప్రాముఖ్యతను గురించి భక్తులకు తెలియజేసినారు. ప్రస్తుత సమాజంలో కుల, మత, జాతి, ప్రాంత, లింగ బేదాలతో కలియుగంలో గొడవలు పెట్టుకుంటు ప్రశాంతత లేకుండ వుంటున్నారు. ఈ తరుణంలో శ్రీ ఏ సి భక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల వారు 1960 లో హరే కృష్ణ మహామంత్రమును విశ్వవ్యాప్తి చేసారు. అద్యాత్మిక అవగాహన లేకపోవడం కారణంగా ప్రపంచ ప్రజలలో ప్రశాంతత లేకుండా తెలియని మానసిక వొత్తిల్లకు లోను అవుతున్నారు.

ఇటువంటి కార్యక్రమాల ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతత పొందుతున్నారు అని తెలియజేసినారు.

## కవి సమయం

### 'నా పల్లె'

ఒకనాటి నా పల్లె
ఎర్రబస్సు దిగి పల్లెకు పోతుంటే
పచ్చని జొన్నచేల మధ్య మంచెకావల్లు
దారి పొడుగునా ఆప్యాయంగా పలకరింపులు
మామిడి, పూలతోటలమాటున పక్షుల కిలకిలలు
తంగేడు గుమ్మడి పూలబతుకమ్మ ఆటలు
ఏ గుడిసె ముందు నిలబడినా
సేద తీర్చుకోమని చల్లని మజ్జిగ ఇచ్చిన అక్కలు
పట్నంలో ఏం చేస్తున్నావురా అంటూ
ఆప్యాయంగా చేతిని నిమిరిన అమ్మలు
నేడు అవి అన్ని కానరాకుండా పోయాయి
గుడిసెల స్థానంలో భవంతులు
గుడిసెలలో జనం సుదూర ప్రాంతాలకు వలసలు
రోగాలతో చెట్ల క్రింద మూలుగుతున్న ముదుసలులు
భవంతులతో టి.విలకు అతుక్కుపోయిన కొందరు
తండ్రి కొడుకులతో మాట్లాడలేని బిజిబిజి
తమ్సుఅప్‌ల రసకేళీ బ్రాంది బీర్ల దుకాణాలు
ఇంటర్‌నెట్‌లో చాటింగ్‌లు
పేదల సమాధులపై పెద్దల విహార కేళి
పల్లె మారింది పల్లె సంస్కృతి మారింది

... కవితా రచన
తుంపాల శ్రీరామమూర్తి
సెల్ నెం : 9440260280

## పంచాంగం

| మాసం : మాఘ; తిథి : చతుర్దశి రా. 10.01<br>పునర్వసు రా. 8.09 వ.ఉ. 8.59 ల 10.36 వరకు | మంగళవారం<br>30-01-2018 |
|---|---|

**మేషం** : వాదోపవాదాలకు దూరంగా ఉండటం మంచిది. నిరుద్యోగులకు ఒక ప్రకటన కొత్త ఉత్సాహం కలిగిస్తుంది. స్త్రీలకు ఆధ్యాత్మిక విషయాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆర్థిక స్థితి మెరుగుపడటంతోపాటు రుణ విముక్తులు అవుతారు. **వృషభం** : వస్త్ర, బంగారు, వెండి వ్యాపారస్తులకు లాభదాయకం. స్త్రీలకు వస్త్రములు, అలంకరణలు, విలాస వస్తువుల పట్ల ఆకర్షణ పెరుగుతుంది. వాణిజ్య ఒప్పందాలు, స్థిరచరాస్తుల లావాదేవీల్లో ఏకాగ్రత వహించండి. గత కొంతకాలంగా మీరు అనుభవిస్తున్న ఒత్తిళ్లు, చికాకులు క్రమంగా తొలగిపోతాయి. **మిథునం** : ఉద్యోగస్తుల సమర్థతకు మంచి గుర్తింపు లభిస్తుంది. రుణం ఏ కొంతైనా తీర్చాలన్న మీ సంకల్పం నెరవేరగలదు. స్త్రీలు భేషజాలకు, మొహమాటాలకు పోవటం మంచిది కాదు. బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. విద్యార్థులకు ధ్యేయంపట్ల ఏకాగ్రత చాలా అవసరం. **కర్కాటకం:** అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లు అనుకూలిస్తాయి. లీజు, ఏజెన్సీ, స్థిరాస్తుల కొనుగోళ్ల విషయంలో తొందరపాటుతనం కూడదు. దంపతుల మధ్య కలహాలు తలెత్తే ఆస్కారం ఉంది. ఏజెంట్లు, మార్కెటింగ్ రంగాల వారి టార్గెట్లు పూర్తి కాగలవు. సేవ, సాంఘిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. దేవాల యాలను దర్శిస్తారు. **సింహం:** కుటుంబ సమస్యలు తీరి, ఆర్థిక పరిస్థితిలో ఆశాజనకమైన మార్పులు సంభవిస్తాయి. పాత మిత్రుల కలయికతో మీలో మార్పు వస్తుంది. విద్యార్థుల ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. మీ యత్నాలకు సన్నిహితులు అన్నివిధాలా సహకరిస్తారు. తలపెట్టిన పనులు కొంత ఆలస్యంగా నైనా పూర్తి చేస్తారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అయ్యే సూచన లున్నాయి. **కన్య:** ఆస్తి వ్యవ హారాల్లో ముఖ్యుల ప్రతిపాదనల్ని వ్యతిరేకిస్తారు. గృహ నిర్మాణాలు, మరమ్మత్తులు చేపడతారు. ఉద్యోగస్తులకు తోటివారితో సమస్యలు తలెత్తుతాయి. నిరుద్యోగ యత్నాలు ఒక కొలిక్కి వస్తాయి. ప్రైవేటు సంస్థలలోని వారికి నిరుత్సాహం కలిగి స్తుంది. **తుల:** ఆర్థిక లావాదేవీలు, కీలకమైన వ్యవహారాలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. స్త్రీలకు చుట్టుప్రక్కల వారి నుంచి ఆహ్వానాలు అందు తాయి. నిత్యా వసర వస్తు వ్యాపారులకు, స్టాకిస్టులకు కలసిరాగలదు. కుటుంబ సౌఖ్యం, ఆత్మీయులతో వినోదాలు వంటి శుభ పరిణామాలుంటాయి. **వృశ్చికం:** స్త్రీల మాటకు వ్యతిరేకత ఎదురవుతుంది. విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనలకు గురవుతారు. ఉద్యోగయత్నాలు ఆశాజనకంగా సాగుతాయి. ప్రయాణాల్లో తగు జాగ్రత్తలు తీసు కోవలసి ఉంటుంది. దూరపు బంధువుల నుంచి బహుమతులను అందుకుంటారు. చేతి వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అనుకూలం. **ధనుస్సు:** స్త్రీల ఆలోచనలు పొదుపు దిశగా కొనసాగుతాయి. దైవదీక్షలు, సేవా కార్యక్రమాలపట్ల ఆసక్తి పెరుగు తుంది. విద్యార్థులు, ఉపాధ్యాయుల తీరును గమనించి మెలగాల్సి ఉంటుంది. నూతన పెట్టుబడులు, టెండర్లు అనుకూలిస్తాయి. **మకరం:** విద్యార్థులు నిరంతర కృషివల్ల అభివృద్ధి పొందుతారు. భాగస్వామిక చర్చల్లో మీ ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తుంది. ఆస్తి వ్యవహారాలకు సంబంధించి సోదరులతో ఒక అవ గాహనకు వస్తారు. వృత్తుల వారికి, ఏజెంట్లు, బ్రోకర్ల శ్రమకు తగిన ఆదాయం లభిస్తుంది. గృహ నిర్మాణాలు, మరమ్మత్తులు అనుకూలిస్తాయి. **కుంభం:** రాబడికి మించిన ఖర్చులు, చెల్లింపులవల్ల స్వల్ప ఆటుపోట్లు తప్పవు. ప్రింటింగ్, బైండింగ్ పనివారలకు మందకొడిగా ఉంటుంది.

# బాలల అక్రమ రవాణాను నిరోధించాలి



గాజువాక: బాలల అక్రమ రవాణాను నిరోధించాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.యస్. భాగ్యలక్ష్మి స్పష్టం చేసారు. సోమవారం మేఘాద్రిగెడ్డ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికా పాఠశాలలో 'కిషోర వికాసం' పథకం క్రింద యూనిసెఫ్ సౌజన్యంతో మల్కాపురం సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల పీర్ లీడర్స్ నిర్వహించిన కౌమరా విద్యాతరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ 10సం. నుంచి 19సం.లు వయస్సు ఉన్న వారిని కౌమారులు అని అంటారని, వీరికి ఎదుగుదలలో వస్తున్న మార్పుల పట్ల, వ్యక్తిగత పరిశుభ్రతపట్ల, సామాజిక సమస్యల పట్ల అవగాహన కల్గించాలని కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.రామారావు మాట్లాడుతూ తమ పాఠశాలలో కౌమార విద్యా విషయాలను బోధిస్తున్నట్లు తెలిపారు. సామాజిక దృక్పధంతో తమ పాఠశాలలకు వచ్చిన పీర్‌లీడర్లును, జాతీయ సేవా పథక ప్రోగ్రాం అధికారులను ఆయన అభినందించారు. తరగతులలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమరవాణా, ఎదుగుదలలో వస్తున్న మార్పులు, పౌష్టికాహారం, పరిశుభ్రత, లైంగిక వివక్షత మొ.అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిభావంతంగా సమాదానాలు చెప్పిన విద్యార్ధులకు బహుమతులను అందజేసారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి వై.అనసూయదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






తెలుగుదేశం దుష్ట పరిపాలనను అంతమొందించాలని పిలుపునిచ్చిన రాష్ట్ర వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు, ఇప్పటి వరకు జగనన్న 1000 మైళ్ల ప్రజా సంకల్ప యాత్ర పూర్తి చేసినందుకు జగనన్నకు మద్దతుగా విశాఖలో కంచరపాలెం ముత్యమాంబ గుడి వద్దనుంచి 'జగనన్నకు మద్దతుగా నడుద్దాం' అని పాదయాత్రను చేపట్టారు.

ఈ పాదయాత్రలో నగర వైకాపా అధ్యక్షుడు మళ్ళ విజయప్రసాద్, తైనాల విజయకుమార్, పక్కి దివాకర్, గరికిన గౌరి, ఆల్ఫా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ ప్రజా పోరాటాలకు సిద్దమవుదాం..

## సిపిఐ జిల్లా కార్యదర్శి పి.కామేశ్వరరావు




విజయనగరం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) విజయనగరం జిల్లా 12వ మహాసభలు ఈనెల 27, 28 తేదీల్లో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. మొదటిరోజు భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరిగాయి. ఈ బహిరంగసభలో సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రసంగించారు. రెండవ రోజు జిల్లా నుంచి అన్ని మండలాల నుంచి 120 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. గడచిన మూడేళ్లలో జరిగిన పార్టీ కార్యక్రమాలపై జిల్లా కార్యదర్శి పి.కామేశ్వరరావు పెట్టిన నివేదికపై సమగ్రమైన చర్చలు ప్రతినిధులు చర్చించి రాబోయే కాలంలో జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలపై పలు తీర్మానాలు చేయడం జరిగిందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.కామేశ్వరరావు సోమవారం అమర్‌భవన్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో తెలిపారు. జిల్లా పార్టీ 49 మందితో నూతన కమిటీని, 12 మందితో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకొన్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శిగా పి.కామేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా ఒమ్మిరమణ, బుగత అశోక్‌లు, జిల్లా కార్యవర్గసభ్యులుగా వి.కృష్ణంరాజు, ఆల్తి అప్పలనాయుడు, బుగత సూరిబాబు, అలమండ ఆనందరావు, బాయి రమణమ్మ, మద్ది కృష్ణ, ఆర్.వి.ఎస్.కుమార్, మండంగి గోపాలరావు, మద్ది మాణిక్యంలను ఎన్నుకోవడం జరిగిందని కామేశ్వరరావు తెలిపారు. జిల్లాలో నిటి వనరులను అభివృద్ధి చేయాలని, మూసివేసిన పరిశ్రమలను తెరిపించాలని అగ్రిగోల్డ్ బాధితుల డబ్బులు చెల్లించాలని, గ్రామీణ పేదలకు భూములు పంచాలని, పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు సమస్య పరిష్కరించాలని, పేదలు ఆక్రమించుకున్న భూములకు పట్టాలు ఇవ్వాలని పలు తీర్మాణాలను ఆమోదించి భవిష్యత్ సమస్యలపై పెద్ద పోరాటాలు నిర్వహించలని, పోరాటాలకు ప్రజలంతా సహకరించాలని జిల్లా కార్యదర్శి కామేశ్వరరావు కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఒమ్మి రమణ, బుగత అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు వి.కృష్ణంరాజు, బుగత సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మీకోసంనకు 150 వినతులు



విజయనగరం : జిల్లా కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి 150 వినతులు వచ్చాయి. జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.ఎస్.రాజకుమార్ వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదు స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కళాకారులకు గుర్తింపుకార్డులు మంజూరు చేయాలని సప్తపది సంగీత నృత్య సేవా కళాపీఠం, జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎన్.శ్యామ్‌కుమార్ పలువురు కళాకారులు వినతిపత్రం సమర్పించారు. బొండపల్లి సొసైటీలో గల పోరాం గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న ఊరచెరువు వేలంపాట రద్దుచేసి స్వదేశీ మత్స్యకార సహకార సంఘాలకు లీజుకు ఇవ్వాలని స్వదేశీ మత్స్యకార సంఘం అధ్యక్షులు ఆకేటి ఈశ్వరరావు, కెల్ల చిన్నోడు తదితరులు వినతిపత్రంలో కోరారు. బొబ్బిలి మండలం అలజంగి గ్రామానికి చెందిన 57 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరై నిధులు విడుదల చేయలేదని రైతులు ఆవితి పోలినాయుడు, మెరుపులజోగినాయుడు, సందక సింహచలం, ఏగిరెడ్డి అప్పలనాయుడు తదితర 57 మంది రైతులు ఫిర్యాదు చేశారు. నెల్లిమర్ల గ్రామం రామతీర్థం జంక్షన్‌లో గల ప్రాధమిక పాఠశాల ప్రహరీగోడ 2014లో వచ్చిన హుద్‌హుద్ తుఫాన్‌లో కూలిపోయిందని ప్రహరీగోడ నిర్మాణం చేపట్టాలని సి.హెచ్ సన్యాసిరావు దరఖాస్తు అందజేశారు. అంతకుముందు ఉదయం నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి ఐదు వినతులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో కెఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ ఆర్.శ్రీలత, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.సునీల్‌రాజ్‌కుమార్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి రాజు, డిపిఎం పద్మావతి, జిల్లా విద్యాశాఖాధికారి నాగమణి, ఎల్‌డిఎం గురవయ్య, డిబిపిడబ్ల్యుఓ ఖుష్బు కొఠారి, బిసి కార్పొరేషన్ ఇడి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాలను అదిగమించాలి

## తహశీల్దార్ బాపిరాజు



బొండపల్లి : బహిరంగ మలవిసర్జన నిర్మూలనకు, స్వచ్ఛభారత్ కార్యక్రమం ద్వారా నిర్మిస్తున్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో లక్ష్యాలను అధిగమించాలని తహశీల్దార్ డి.బాపిరాజు అన్నారు. సోమవారం మండలంలో దేవుపల్లి గ్రామంలో క్షేత్రస్థాయి మరుగుదొడ్ల నిర్మాణం పరిశీలించారు. అనంతరం గ్రామస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు అందించారు. గ్రామంలో 750 మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉండగా శతశాతం నిర్మాణాలు జరిపి తొలి విడతగా బిల్లులు అందజేయడం జరిగిందన్నారు. అందరూ సమిష్టిగా పనిచేసి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్వో శ్రీరామూర్తి, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 15లోగా మరుగుదొడ్లు పూర్తి చేయాలి

## ఎంపిడిఓ ఎం.ప్రకాశరావు



బొండపల్లి : ఓడిఎఫ్ గ్రామాలలో ఫిబ్రవరి 15లోగా మరుగుదొడ్లను పూర్తి చేయాలని ఎంపిడిఓ ఎం.ప్రకాశరావు కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాధికారులు, గుత్తేదారులతో సమీక్షా సమావేశం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ శతశాతం మరుగుదొడ్ల సాధనకు అందరూ మరింత కృషి చేయాలని కోరారు. రెండవదశ బిల్లులకు మరుగుదొడ్లను సిద్ధం చేయాలని కోరారు. ఇందుకు సంబంధించి మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుకోవాలని ఆయన స్పష్టం చేశారు. బిల్లులు చెల్లింపులో తాత్సారం చేస్తే సహించేదిలేదని అధికారులను ఎంపిడిఓ ప్రకాశరావు హెచ్చరించారు. గ్రామస్థాయిలో అందరూ సమన్వయంతో పనిచేసి మరుగుదొడ్లను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇఓపిఆర్‌డి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు కృషి

## నూతన సిఐ ప్రసాదరావు



బొబ్బిలి : బొబ్బిలి గ్రామీణ సర్కిల్‌లో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామీణ సిఐగా బాధ్యతలు చేపట్టిన ప్రసాదరావు తెలిపారు. బాడంగి, తెర్లాం, శీతానగరం, బలిజిపేట ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు, నేరాలు జరగకుండా చర్యలు తీసకుంటున్నామని వెల్లడించారు. పోలీసుల నిబంధనలు అతిక్రమించిన వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ క్రింద కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఇక్కడ సిఐగా పనిచేసిన గోవిందరావు బదిలీకావడంతో ఆయన స్థానంలో సిఐగా బాధ్యతలు స్వీకరించారు.

# వై.ఎస్.పథకాలను నీరుగార్చుతున్న టిడిపి ప్రభుత్వం

## వైఎస్ఆర్ పార్టీ నాయకులు విమర్శ



బొండపల్లి : మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వై.ఎస్.రాజశేఖరరెడ్డి పేద ప్రజలకు అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను టిడిపి ప్రభుత్వం నీరుగార్చుతుందని మండల వైఎస్ఆర్ పార్టీ నాయకులు విమర్శించారు. సోమవారం ప్రజా సంకల్పయాత్రలో భాగంగా వైఎస్ జగన్ వెయ్యి కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసిన సందర్భంగా జగన్‌కు సంఘీభావం తెలుపుతూ గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఆధ్వర్యంలో దేవుపల్లి నుండి గొల్లుపాలెం గ్రామం వరకు భారీస్థాయిలో పాదయాత్ర జరిగింది. అనంతరం గొల్లుపాలెం గ్రామంలో రాచకిండాం పిఏసిఎస్ అధ్యక్షుడు చల్ల చెల్లంనాయుడు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి మాజీ ఎంపిపి రాపాక సూర్యప్రకాశరావు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా అయినప్పటి నుండి సంక్షేమ పథకాలనను ప్రజలకు అందకుండా చేస్తున్నారన్నారు. గతంలో ఇందిరమ్మ గృహ పథకం పేరిట అర్హులైన అందరికి ఇళ్లు మంజూరు చేసారని అయితే నేడు టిడిపి ప్రభుత్వం పదుల సంఖ్యలో కూడా గృహాలు మంజూరు చేయడం లేదని విమర్శించారు. జిల్లా సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడుగా తాళ్లపూడి కృష్ణ మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి కాలంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసారని గుర్తు చేశారు. సభాధ్యక్షుడు చల్లా చెల్లంనాయుడు మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో మెలగి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రి చేయాలని కోరారు. వైఎస్ఆర్ పార్టీ యువజన విభాగ నాయకుడు మీసాల తులసీరావు మాట్లాడుతూ చంద్రబాబు వస్తే యువతకు జాబు ఇస్తానని వాగ్దానం చేసారని కనీసం నిరుద్యోగులకు భృతి ఇవ్వలేదని ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో చింతపల్లి సూర్యనారాయణ, శిరపురపు సూర్యనారాయణ, మాజీ ఎంపిపి బండారు బంగారం, సుంకరి ఈశ్వరరావు, ప్రముఖ గుత్తేదారు బి.వి.ప్రభుజీ, బొద్దల చిన్నంనాయుడు, కె.వెంకటరావు, తొత్తడి సత్తిబాబు, లెంక అప్పారావు, దాసరి రామారావు, గొట్టిముక్కుల వర్మరాజు, తాడ్డి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావ పాదయాత్ర సక్సెస్ : జగన్ వెయ్యి కిలోమీటర్ల పాదయాత్రకు సంఘీబావంగా మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో జరిగిన పాదయాత్ర సక్సెస్ అయిందని పరిశీలకుల అభిప్రాయం. గత మూడు రోజులుగా గ్రామాలవారీగా పార్టీ పెద్దలు కార్యకర్తలను సమీకరించి పాదయాత్రకు రప్పించడంలో అధిష్టానం విజయవంతం అయిందని రాజకీయ విశ్లేషకుల సమాచారం. సుమారు రెండువేల మంది ఈ యాత్రకు హాజరైనట్లు సమాచారం. ఈమేరకు మండలస్థాయి నాయకులు విజయవంతం అయ్యారని చెప్పొచ్చు.

# ప్రజా ఫిర్యాదులను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు

## జిల్లా ఎస్పీ జి.పాలరాజు



విజయనగరం : జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి.పాలరాజు సోమవారం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ వ్యధ విభాగానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 17 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించారు. ఈ ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వయంగా స్వీకరించి, ఫిర్యాదుదారులతో మాట్లాడి, ఫిర్యాదు అంశాలను పరిశీలించి,వాటిని పరిష్కరించేందుకు, వాటిపై చర్యలు చేపట్టేందుకు సదరు ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు పంపారు. విజయనగరం పట్టణానికి చెందిన ఒకామెను చిల్లంగి ఉందన్న నెపంతో లంకాపట్నంకు చెందిన కొంత మంది వ్యక్తులు తనను ధూషిస్తున్నట్లు, చంపుతామని బెదిరిస్తున్నట్లు, తన పేరున గల 8 ఎకరాల భూమిని తన తదనంతరం తన మనమలకు కాకుండా వేరే వ్యక్తులు అనుభవించేందుకు ప్రయత్నిస్తున్నట్లు, న్యాయం చేయాల్సిందిగా ఎస్పీని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ విజయనగరం 2వ పట్టణ పోలీసులను విచారణ చేపట్టి, న్యాయం చేయాల్సిందిగా ఆదేశించించారు. మెరకముడిదాంకు చెందిన జ్యోతి అనే ఆమె వెలుగు స్కీంలో నెలకు రూ.30 లు చెల్లించినట్లు, వాయిదాలు పూర్తి అయినప్పటికి తనకు రావల్సిన రూ. 3 లక్షలు ఇచ్చేందుకు బ్యాంకు ఎపిఎం మరియు సిసి అడ్డుకుంటున్నట్లు, న్యాయం చేయాల్సిందిగా ఎస్పీని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ చీపురుపల్లి సిఐను విచారణ చేపట్టి, న్యాయం చేయాల్సిందిగా ఆదేశించారు. సాలూరు మండలం నెలిపర్తికి చెందిన త్రినాధకు వారసత్వంగా 1.58 ఎకరాలు భూమి సంక్రమించినట్లు, దానిని తన అన్నయ్య ఆక్రమించుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు, న్యాయం చేయాల్సిందిగా ఎస్పీని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ సాలూరు సిఐను పూర్తిస్థాయి విచారణ చేపట్టి, నివేదిక సమర్పించాల్సిందిగాను, ఫిర్యాదికి న్యాయం చేయాల్సిందిగా ఆదేశించారు. విజయనగరం పట్టణం దాసన్నపేటకు చెందిన అనంత కుమార్ ఫిర్యాదు చేస్తూ తన భార్య తనపై వరకట్న వేధింపుల కేసు పెట్టిందని, ఈ కేసు విచారణలో ఉండగా మరికొన్ని తప్పుడు ఫిర్యాదులతో కేసులు పెట్టి, తనను మానసికంగా వేధిస్తుందని, న్యాయం చేయాల్సిందిగా ఎస్పీని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ ఇరు వర్గాలను ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీలో హాజరుపర్చాల్సిందిగా విజయనగరం 2వ పట్టణ సిఐను ఆదేశించారు. చీపురుపల్లికి చెందిన మేజరు అయిన యువతీ యువకులు తమ తల్లిదండ్రులకు ఇష్టానికి వ్యతిరేకంగా ప్రేమించుకొని, ఈ నెల 26న వివాహం చేసుకున్నట్లు, తమకు ఇరు కుటుంబాల నుండి బెదిరింపులు ఉన్నందున, రక్షణ కల్పించాల్సింది ఫిర్యాదు చేసారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ ఇరు కుటుంబాల పెద్దలను పిలిపించి, కౌన్సిలింగు నిర్వహించాలని చీపురుపల్లి సిఐని ఆదేశించారు. మెంటాడకు చెందిన పైడియ్యకు అదే గ్రామంలో 1.14 ఎకరాల భూమి కలదని, దానిని వేరే వ్యక్తులకు అప్పగించేందుకు అదే గ్రామంకు చెందిన అప్పలనాయుడు మరికొంత మంది ప్రయత్నిస్తున్నట్లు, న్యాయం చేయాల్సిందిగా ఎస్పీకి ఫిర్యాదు చేసారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ గజపతినగరం సిఐను పూర్తి స్థాయిలో విచారణ జరిపి, ఫిర్యాదికి న్యాయం చేయాల్సిందిగా ఆదేశించారు. ఫిర్యాదుల విభాగానికి వచ్చే ఫిర్యాదులను జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించి, వాటిపై తక్షణమే

స్పందించాలని, వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను తనకు వెంటనే నివేదించాలని జిల్లా ఎస్పీ జి.పాలరాజు పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ వై.వి. శేషు, రామకృష్ణలు పాల్గొన్నారు.

# చంద్రగ్రహణం సందర్భంగా 31న రామనారాయణం మూసివేత

విజయనగరం : ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం శ్రీమద్రామయణ ప్రాంగణం రామనారాయణంను చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని 31వ తేదీ బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుండి ఫిబ్రవరి 1వ తేదీ గురువారం మధ్యాహ్నం 11 గంటల వరకు దర్శనాలను నిలిపివేయనున్నామని ఎన్ సి ఎస్‌ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం నుండి భక్తులు యథావిధిగా దర్శనాలు చేసుకోవచ్చని ప్రకటనలో పొందుపరచారు.

# మత్స సంతోషిని అభినందించిన జిల్లా ఎస్పీ



విజయనగరం : జిల్లాలోని కొండ వెలగాడ గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టర్ మత్స సంతోషిని జిల్లా ఎస్పీ జి. పాలరాజు అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం మత్స సంతోషి జిల్లా ఎస్పీ జి. పాలరాజును మర్యాద పూర్వకంగా కలిసారు. ఇటీవల కర్నాటక రాష్ట్రం మంగుళూరులో ఈ నెల 21 నుండి 25 వరకు జరిగిన 70వ పురుష మరియు 33వ మహిళా సీనియర్ నేషనల్ వెయిట్ లిఫ్టింగు చాంపియన్‌షిప్‌లో మూడు బంగారు పతకాలను సాధించినట్లుగా జిల్లా ఎస్పీకి మత్స సంతోషి వివరించారు. మంగుళూరులో జరిగిన మహిళా సీనియర్ నేషనల్ వెయిట్ లిఫ్టింగు చాంపియన్‌షిప్‌లో స్నాచింగులో 81 కిలోలు, క్లీన్ మరియు జర్కింగులో 104 కిలోలు, ఓవర్ ఆల్‌గా 185 కిలోల బరువును ఎత్తి, మూడు విభాగాల్లోనూ బంగారుపతకాలు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాబోయే కాలంలో మత్స సంతోషి మరింతగా క్రీడలలో రాణించి, అంతర్జాతీయ క్రీడా పోటీలలో రాణించాలని అభిలషించారు.

DISTANCE EDUCATION
B.a., B.Com., B.Sc.,
M.A., M.Com., M.Sc.,
All Groups
GRACE ACADEMY
SBI మేడపైన - సబ్బవరం
77806 64414,
99666 99633

DSC + TET
SGT - & S A Social
Group IV & Group
VRO - VRA
క్లాసులు ప్రారంభమయినవి
GRACE ACADEMY
SBI మేడపైన - సబ్బవరం
77806 64414,
99666 99633



# సమాజంలో స్త్రీకి చాలాప్రాముఖ్యత ఉంది




యానాం : సమాజంలో స్త్రీకి చాలా ప్రాముఖ్యత ఉందని ఒక తల్లిగా భార్యగా, చెల్లిగా, కూతురిగా అనేక పాత్రలు పోషిస్తుంది స్త్రీ అని ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ డరెక్టర్ ఎస్‌పి రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం స్థానిక చిల్డ్రన్ ఆడిటోరియంలో మహిళా శిశుసంక్షేమశాఖ ఉమా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో యానాం ఒల్డేజ్ హెూం, మున్సిపాల్టీ వర్కర్స్‌కి బేటీబచావో, బేటీ పాడావో అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి మాట్లాడారు. మహిళలను చిన్నచూపుచూస్తు అనేక దాడులకు పాల్పడు తున్నారని అటువంటి ఘటనలకు పాల్పడేవారి పై కఠినంగా శిక్షేంచేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకొచ్చాయన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడి హర్యానా రాష్ట్రంలో బేటీబచావో, బేటీపడావో కార్యక్రమం చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. ఈ సభలో ఉమా ఎడ్యుకేషనల్ సొసైటీ ఎడ్వేజర్ నున్నా రామకృష్ణారావు మాట్లాడుతూ ప్రతీ బాలిక ఉన్నతమైన స్థాయిలోకి వెళ్ళాలని సమాజంలో మహిళల పాత్ర చాలా అవసరమని వారిని స్వేచ్ఛగా బ్రతకనివ్వాలని వివరించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ఎన్. సీతారామ కృష్ణారావు మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలవలన బాలలయొక్క జీవితం నాశనం అవుతుందని ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నతమైన స్థాయికి ఎదిగేలా ప్రోత్సాహించి ముందుకు నడిపించాలన్నారు. చైల్డ్‌లైన్ కొ అర్డినేటర్ ఎం. ప్రియంకా మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిగినా 1098కి ఫోన్‌చేసి సమాచారం అందించాలని చిన్న వయస్సులో వివాహాలు చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్‌వెల్‌ఫేర్ అధికారి చింతారామజోగి, సిబిఆర్ కోఆర్డినేటర్ ఎస్.ఎ. నాయుడు, జివివిఎస్ తాతారావు, కె. శ్రీనివాస్, పిబి ప్రసాద్, శ్రీదేవి, నూకరత్నం, విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

## విజయభాను క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎస్సై పార్ధసారధి



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్ధానిక పోలీసు స్టేషన్ నందు ఎస్షై పార్ధసారధి విజయభాను క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయభాను తెలుగుదినపత్రిక విజయపధంలో ముందుకు దూసుకుపోతుందని,నిజాలను నిర్బయంగా వెలుగులోకి తీసుకొనివచ్చి వ్రాసే పత్రిక విజయభానుతెలుగుదినపత్రిక అని కొనియాడారు.

## వాక్ విత్ జగనన్న లో పాల్గొన్న వై.సి.పి.నాయకులు



భీమునిపట్నం : తగరపువలసలో జగన్ పాదయాత్ర 1000 కిలోమీటర్లు అయిన సందర్భంగా తగరపువలస లో వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త అక్కర మాని విజయ నిర్మల ఆధ్వర్యంలో వాక్ విత్ జగనన్న కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమం సంగివలస మూడుగుళ్ళు నుండి ప్రారంభమయి చిట్టివలస సప్తగిరి ధియేటర్ వరకూ జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, ఎస్. కరుణాకర్ రెడ్డి,, వేంపాడ.శ్రీనివాసరెడ్డి, జీరు వెంకటరెడ్డి, జగ్గుపిల్లి ప్రసాద్, కదిరి.ఎల్లాజీ, వైఎస్సార్ సీపీ విద్యార్ధి విబాగం నాయుకులు కంటుభుక్త.ప్రభాకర్ నాయుడు, గరికిన వెంకట్, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నాగాభట్ల.అశ్రీతకు వీణ వాయిద్యంలో ప్రధమ బహుమతి



అన్నవరం : తూ.గో.జిల్లా కాకినాడ జెయన్ టియు లో జరిగిన క్రియ - చిల్డ్రన్స్ ఫెస్టివల్ స్టేట్ లెవల్ ఇంటర్ స్కూల్ కల్చరల్ కాంపిటీషన్స్ లో సత్యసాయి విద్యావిహార్ స్కూల్ లో 9 వ తరగతి చదువుతున్న నాగాభట్ల ఆశ్రీత వీణ వాయిద్యం లో ప్రథమ బహుమతి సాధించిన సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ హరిశ్చంద్ర ప్రసాద్ విద్యార్థినికి అభినందనలు తెలిపారు. ఇలాంటి విజయాలు మరిన్ని సాధించి స్కూల్ కి తల్లిదండ్రులు కి మంచి పేరు తీసుకురావాలని అభిలషించారు.

# మత్స్యకారులను ఎస్టీలో చేర్చాలి

### 34వ రోజుకు చేరుకున్న రిలేనిరాహార దీక్షలు

విశాఖపట్నం : మత్స్యకారులను ఎస్టీలో చేర్చాలని కోరుతూ చేస్తున రిలేనిరాహార దీక్షలు 34వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు మత్స్యకార ఎస్టీ సాదన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలో నల్లకండువాలు ధరించి నిరసనలు తెలిపారు. ఈ మేరకు నినాదాలుచేశారు. మత్స్యకార నాయకులు, మాజీ కార్పొరేటర్ బుడ్డా నీలకంఠం, కన్వీనర్ మూగి శ్రీరామూర్తి సంయుక్తంగా మాట్లాడుతూ అమాయకులైన మత్స్యకారులను మోసంచేయడం తగదన్నారు. గత 34 రోజులుగా దీక్షలుచేస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందన లేకపోవడం సిగ్గుచేటన్నారు. గిరిజనులుకన్నా దయనీయస్థితిలో ఉన్నామన్నారు. వేటకు వెళ్తే తిరిగివస్తామో రామో అన్న ఆందోళనలో జీవనం సాగిస్తున్న తమకి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పేర్ల విజయచంద్ర, ఓడరేవు సింహాచలం, ఉమ్మిడి సుజాత, చెన్నాదాస్, వాసుపల్లి జానీ, బడే యల్లాజీ, అప్పలరాజు, పేర్ల బాస్కర్, కంబాల షణ్ముక్, బడే అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## షటిల్ టోర్నమెంట్ ప్రారంభించిన గంటా

భీమునిపట్నం : తగరపువలస ఎన్.సి.వై క్లబ్ గౌరవాధ్యక్షులు కొప్పలరమేష్ ఆధ్వర్యంలోఎన్ సి వై షటిల్ టోర్నమెంట్‌ను మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షటిల్ ఆడడం ఆరోగ్యానికి మంచిదనీ అన్నారు. ఆటల వలన ఆరోగ్యము మెరుగు పడడమేకాకుండా, చురుగ్గా ఉంటారనీ అన్నారు. మన ప్రభుత్వం స్పోర్ట్స్ కోసం చాలా వ్యయం ఖర్చు పెడుతున్న దనీ చెప్పారు. మాజీమంత్రి ఆర్. ఎస్. డి పి అప్పలనర్సింహరాజు మాట్లాడుతూ షటిల్ వలన శరీరం తేలికగా ఉంటుందనీ అన్నారు.వై.ఎం.సి క్లబ్ గౌరవ అధ్యక్షులు కొప్పలరమేష్ మాట్లాడుతూ స్థానిక బాలాజీ నగర్ లో కొంత స్థలం ఉందని టోర్నమెంట్ కోసం కావాలని అడగడంతో గంటా స్పందించి త్వరలో చేయనున్నట్లు చెప్పారు ఈ పోటీలు సీనియర్, జూనియర్ మధ్య జరుగుతాయనీ గెలుపొందిన వారికి ఈనెల 31న సీనియర్, జూనియర్ విబాగాల్లో బహుమతులు ప్రధమ,ద్వితీయ, తృతీయ, చతుర్ద బహుమతులు అందజేయబడుతుందనీ చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో గంటాప్రతినిధి సి.హెచ్. విజయ్ బాబు, ఎంపిపి యరబాల కృష్ణవేణి,మాజీ ఎంపీపి గాడు వెంకటప్పడు, టిడిపి నాయకులు కొప్పల కృష్ణ, అనీల్ ప్రసాద్, ఆనందపురం మాజీ ఎంపిపి కోరాడ రాజబాబు,కొప్పల కృష్ణ , రవ్వవెంకటరావు,పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.



యలమంచిలి ఎమ్ఎల్ఎ పంచకర్ల రమేష్‌బాబు తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం దళిత తేజం కార్య క్రమంపై నాలుగు మండలాల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అచ్యుతాపురం ఎమ్‌పిపి రాజాన రమేష్‌కుమార్, టిడిపి నాయకులు ఆడారి ఆనంద్ కుమార్ జెడ్‌పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, ఎఎమ్‌సి చైర్మెన్ దూళి రంగనాయకులు, మాజీ ఎమ్‌పిపి ఆడారి మంజు, ఎమ్‌పిటిసి గుడువాడ సుదాలతా జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడిసి సోమన్నారాయణకు ఘనంగా సన్మానం

గాజువాక: పారిశ్రామిక ప్రాంతం శెట్టిబలిజ-గౌడ సంక్షేమ సంఘం ఆద్వర్యంలో జోన్-5 ఎక్స్ జెడ్సీ, ఏడీసీ సోమన్నారాయణకు ఘనంగా సన్మానం చేసారు. పుష్పగుచ్ఛాన్నిచ్చి, శాలువా వేసి, ఘనంగా సన్మానించారు. గాజువాక జియంటి మిని ఫంక్షన్ హాల్‌లో సంఘం అధ్యక్షులు నెల్లి సాధురావు అధ్యక్షతన పారిశ్రామిక ప్రాంతం శెట్టిబలిజ-గౌడ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు సంఘం అభివృద్ధి,సంక్షేమం కోసం పలు సూచలను చేసారు. అనంతరం పై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పంపాన అర్జునరావు, ప్రధాన కార్యదర్శి గొడ్డికన్నారావు, సంపంగి హరిబాబు, ప్రముఖ న్యాయవాది అండిబోయిన లక్ష్మి, అండిబోయిన అప్పారావు, దొమ్మేటి రమణారావు, బత్తిన పరదేశి,దొమ్మేటి అప్పారావు, సంపంగి ఈశ్వరరావు, వివిద వార్డులకు చెందిన సుమారు 150 సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి సంక్షేమం తెదేపాతోనే సాధ్యం



సింథియా: అభివృద్ధి సంక్షేమం తెదేపాతోనే సాధ్యమని జీవీయంసీ 49వ వార్డు తెదేపా అధ్యక్షులు మజ్జిసోమేష్ అన్నారు. సోమవారం మల్కాపురం శ్రీ మరిడిమాంభ ఆలయ వద్ద అభివృద్ధి పనులకు శంకుస్ధాపన చేసారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.10లక్షలతో కల్వర్టు పనుల నిర్మాణంనకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి. గణబాబు చొరవతో వార్డులో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్డులోని ప్రజల అవసరాలకు అవసరమగు పనులను సకాలంలో పూర్తి చేసి అందుబాటులోనికి తీసుకొస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోనే 49వ వార్డును అభివృద్ధిపర్చి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలతో ముందుకు పోతన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెదేపా నాయకులు కాకి పోలిరెడ్డి, వార్డు తెదేపా నాయకులు ఉరుకూటి అప్పలరాజు, సర్వసిద్ది శ్రీలక్ష్మి, జోజిబాబు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి విద్యార్థుల అపూర్వ కలయిక



సబ్బవరం : సబ్బవరం మండలంలోని రావులమ్మపాలెం గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూలులో 1997-98 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులంతా అడ్డూరు గ్రామంలోని మజ్జిగైరమ్మ ఆలయం ప్రాంగణం లో సమావేశమయ్యారు. సుమారు 20 సంవత్స రాలు తరువాత అందరూ ఒకే చోట కలవడంతో పండగ వాతావరణం నెలకుంది. ఆనాట సంఘటనలను గుర్తు చేసుకొని ఆనంద పరవశంపొందారు. 1997-98 సంవత్సరం బ్యాచ్ లో వివిధ సమస్యలతో ఇబ్బంది పడుతు న్న కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేస్తా మని తీర్మానించారు. ఈ కార్యక్రమం లో శింగం పల్లి అప్పలనాయుడు, డిటిమరెడ్డి, గౌరీశంకర్, గొల్లి శ్రీరామమూర్తి, గొంప దేముడు, గొర్లె అశ్విద్దరావు, వర్రి అబద్ధం, రావాడ నాయుడు, అనకాపల్లి ముత్యలింగం, వంటాకు నాగేశ్, నిరుజోగల నాయుడు, గండి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మత్స్య ఉత్పత్తుల శుద్ధి కేంద్రం

యానాం : పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యఉత్పత్తులను అత్యాధునిక సదుపాయాలు వినియోగించి నిల్వచేయడం, పరిశుభ్రంగా ఉంచే అంశాల గూర్చి జపాన్ అధికారల బృందం తో పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి.నారాయణ సామి సమక్షంలో సమావేశం అయినట్లు మత్స్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు తెలిపారు. జపాన్ శాంకేతిక పరిజ్ఞానంతోపాటు రోజుకు 20 టన్నుల మత్స్యసంపదను 23 డిగ్రీలలో నిల్వచేసేందుకు ఐస్ ప్లాంట్ నిర్మాణానికి రూ. 15 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు సిద్దం చేశామన్నారు. ఆలాగే పుదుచ్చేరిలో 10 టన్నులు, యానాం, కారియకల్ ప్రాంతాలలో నాలుగు టన్నులు, మాహేలో 2 టన్నులు, ట్యూయానా చేపలను శుద్ధిచేసి ఎగుమతి చేయడానికి వీలుగా కేంద్రాలు ఏర్పాటుచేయడానికి జపాన్ బృందంతో చర్చలు జరిపామన్నారు. దీనికీ ఆ దేశం కొంత సహాయం అందిస్తుందన్నారు. సొమవారం ఢిల్లీలో జరిగే సమావేశానికి పుదుచ్చేరి డైరెక్టర్ ఆల్‌ఇండియా ఫిషరీ సంఘ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఇల్లంగోవన్ హాజరవ్వనున్నట్లు మంత్రి మల్లాడి తెలిపారు.

# నిరంతరం ప్రజల్లోనే

### - ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



విశాఖపట్నం : ప్రజల సమస్యలు తెలుసు కోవడానికి నిరంతరం ప్రజల్లోనే వుంటున్నామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. సోమవారం 20వ వార్డులో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో దక్షిణానికి కొత్త శోభను తీసుకువస్తున్నామనారు. గత పాలకులు ఈ ప్రాంతాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు.

అభివృద్ధి జరగదనే ముద్రవేసి నిర్లక్ష్యంగా వదిలేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బొట్టా పరదేశీయాదవ్, రామూర్తి చిన్నమ్మలు, కొండలరావు, వినయ్, సంతోష్, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఏపి ముఖ్యమంత్రిగా జగన్‌కు ఒక్కసారి అవకాశం ఇవ్వండి



గాజువాక: ప్రతిపక్షనేత, వైకాపా రాష్ట్ర అధ్యక్షులు వైయస్‌జగన్‌కు ఏపి ముఖ్యమంత్రి గా ఒక్కసారి ప్రజలు అవకాశం కల్పిస్తే ఏపీ దేశంలోనే ఉన్నత రాష్ట్రంగా అభివృద్ధి చెందడం ఖాయమని గాజువాక వైకాపా సమన్వయ కర్త తిప్పల నాగెరెడ్డి పేర్కోన్నారు. రాష్ట్ర వైకాపా అధ్యక్షులు వైయస్‌జగన్ చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర 74రోజులలో 1000కిమీ పూర్తి అయిన సంధర్భంగా వైకాపా అద్వర్యంలో శుక్రవారం పాదయాత్రను నిర్వహించారు. బి.సి.రోడ్డు కాకతీయ జంక్షన్ నుంచి కొత్త గాజువాక మీదుగా పాత గాజువాక జంక్షన్ వరకు ఈ పాదయాత్రను నిర్వహించారు. జంక్షన్ వద్దనున్న మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగుతుందని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షనేత వైయస్ జగన్ అనేక పోరాటాలు చేస్తున్నా అధికార పార్టీ మాత్రం తన పోకడ మార్చుకోకపోవడం రాష్ట్ర ప్రజల దురదృష్టంమని అన్నారు. తెదేపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలు అవినీతిలో కూరుకు పోయారని, జేబులు నింపుకోవడానికే తప్ప రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. జగన్ తలపెట్టిన ప్రజా సంకల్పయాత్రకు ప్రజలు నీరాజనాలు పడుతున్నారని అన్నారు. రానున్నవి వైకాపా రోజులని రాష్ట్రంలో వైకాపా అధికారం చేపట్టడం ఖాయమని, నవరత్నాల ద్వారా రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమా లను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఎస్సీ,ఎస్టీ, బిసీ,మైనార్టీలకు రిజర్వేషన్‌లను కొనసాగిస్తామని, దళిత వర్గాలకు ఉచిత కరెంటు అందిస్తామని తెలిపారు. 45సం కే పింఛను సదు పాయం కల్పిస్తామని అన్నారు. వైకాపా బలో పేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు రెడ్డిజగ న్నాధం, రాజాన వెంకటరావు, నక్కావెంకట రమణ, పల్లా చినతల్లి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పలాస నియోజకవర్గం పలాస - గొప్పిలి బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మరియు పలాస ఎమ్మెల్యే గౌతు శ్యామ్ సుందర్ శివాజీ జిల్లా పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గౌతు శిరీష, ముఖ్యనాయకులు తదితరులు




# మైక్యూర్ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం



విశాఖపట్నం : పెద్దగదిలో ఉన్న బాల మురళి నగర్ 3వ వార్డులో మైక్యూర్ హాస్పిటల్ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. మైక్యూర్ హాస్పిటల్ బాల మురళి నగర్3వ వార్డులో సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్యస్పందన లభించింది. మైక్యూర్ హాస్పిటల్ ఏర్పాటు చేసిన ఈ శిభిరాన్నిబాల మురళి నగర్ 3వ వార్డు ప్రెసిడెంట్ ఉమ్మిపాల్ రావు ప్రారంభించారు.ఈ సందర్బంగా వైద్యులు మరియు వైద్య బృందం 175 మందికి పరీక్షలునిర్వహించారు.అవరమైన వారికీ ఉచితంగా మందులు అందజేశారు. వైద్యశిభిరంలో యాదవ సేవ సంగం ప్రెసిడెంట్ కె.అప్పల నాయుడు, వైస్ప్రెసిడెంట్ కె.జె.వి. ప్రసాద్ రావు, సెక్రెయాట్రీ ఓ.మోహన్ కుమార్ మరియుబాల మురళి నగర్ ప్రజలు పాల్గొన్నారు. మైక్యూర్ వైద్య బృందం బాలమురళి నగర్ 3వ వార్డు ప్రముఖులకు మరియు ప్రజలకి కార్డియాలజీ,ఎలెక్ట్రోకార్డియోగ్రాఫీ(ఈసిజి), షుగర్, బీపీ, పొడువు మరియు బరువుపరీక్షలు నిర్వహించారు. ప్రజలకి మైక్యూర్ వైద్య బృందం మెరుగైన ఆరోగ్యవిషయంలో సలహాలు, సూచనలు అందించారు. బాల మురళి నగర్ 3వవార్డు ప్రెసిడెంట్ ఉమ్మిపాల్ రావు మాట్లాడుతూ మైక్యూర్ హాస్పిటల్ వారుఇలాంటి కార్యక్రమం చేపట్టడం హర్షణీయం వ్యక్తం చేసారు. మైక్యూర్ వారికీబాల మురళి నగర్ ప్రాంత ప్రజల తరుపున ధన్యవాదాలు తెలిపారు.మైక్యూర్ హాస్పిటల్ ఇలాంటి మంచి కార్యక్రమాలుచేపట్టాడని అభినందించారు.

# జీతభత్యాల సవరణ అమలుకై దీక్ష

## ఎన్ఎంయు డిపో కార్యదర్శి నారాయణ



నర్సీపట్నం : జీత భత్యాల సవరణ అమలుకై దీక్ష చేస్తున్నట్లు ఎన్ఎంయు డిపో కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం ఏపిఆఎస్ ఆర్టీసిలో గుర్తింపు సంఘం నేషనల్ మజ్దూరు యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నర్సీపట్నం డిపోలో రిలే నిరాహారదీక్షలు చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ 01.04.2017 నుండి రావలసిన పేస్కేల్స్ వెంటనే అమలు చేయాలన్నారు. 2013 పే ఏరియల్స్ బాండ్స్ రద్దు చేసి డబ్బులు ఇప్పించాలన్నారు. 8 రోజుల సమ్మెకాలంనకు జీతం చెల్లించాల, 60 రోజుల సమైక్యాంధ్ర సమ్మె ప్రత్యేక సెలవు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జోనల్ ప్రధాన కార్యదర్శి బోళెం రమణ, వైఎన్.రావు, కెఎ.నాయుడు, సిహెచ్.గోవిందు, ఎంటి.మూర్తులు, ఎస్ఎస్.నారాయణ, కోచు బిల్డరు, ఎస్.నారాయణ, టి.మూర్తులు, కండక్టర్లు పాల్గొన్నారు.

# నర్సీపట్నంలో వైసిపి వాక్‌విత్ జగనన్న




నర్సీపట్నం: నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త పెట్ల ఉమాశంకరగణేష్ ఆధ్వర్యంలో వాక్ విథ్ జగనన్న కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతంచేశారు. అనంతరం గణేష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు జగన్ చేస్తున్న పాదయాత్ర 1000 కిలో మీటర్లు చేసుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. ఆయన రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా గెలుపొందటం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మున్సిపాలిటీ అధ్యక్షులు కోనేటి రామకృష్ణ, కౌన్సిలర్లు తమరాన అప్పలనాయుడు, బోడపాటి సుబ్బలక్ష్మి, గొలుసు నర్సింహమూర్తి, నాయకులు బేతిరెడ్డి విజయ్‌కుమార్, చోటి తదితరులు పాల్గొన్నారు.



విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారు గుంటూరు పర్యటనలో భాగంగా విశాఖ శ్రీ శారదా పీఠపాలిత శ్రీ శంకర మందిరం,ఋగ్వేదం,యజుర్వేదా స్మార్త పాఠశాలను సందర్శించారు.శ్రీ శారదామాత మరియు శంకరాచార్యుల వారికి విశేష అర్చన చేసి భక్తులను ఉద్దేశించి అనుగ్రహాభాషణం చేశారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు అందుకున్న టి.డి.పి ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మరియు భక్తులు...





37 వార్డులో సోమవారం ఉదయం 9:30 గం.లకు జై భారత్ నగర్ కొండవాలు ప్రాంతాలలో గౌరవ శాసనసభ సభ్యులు పి.విష్ణుకుమార్ రాజు చొరవతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం జరిగింది. ఎస్పీ నిధులు ఎనిమిది లక్షల రూపాయలు మంజూరు చేసి డ్రైనేజి కాలువలకు వెచ్చించారు. ఈ కార్యమ్రంలో భాజపా నగర ఉపాధ్యక్షురాలు శ్యామల దీపి హాజరయ్యారు.

# డిగ్రీ ఫీజులు తగ్గించి, పరీక్షలు వాయిదా వేయాలి

## ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ, ఆర్డీవోకి వినతి



నర్సీపట్నం : డిగ్రీ తృతీయ పరీక్షలకి సమయం, సిలబస్ విషయంలో స్పష్టత లేనందున వాయిదా వేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. పరీక్ష ఫీజు రూ.3400 కట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. దీనికి స్పందించిన ఆంధ్రా యూనివర్శిటీ విసికి లేఖను రాయాలని ఆర్డీవో పరిపాలానాధికారికి ఆదేశించారు. ఫీజుల విషయమై జిల్లా కలెక్టర్‌కు లేఖ రాస్తున్నట్లు ఆర్డీవో కోరాడ సూర్యారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అప్పన్నదొర, రుషి, జ్ఞానసుందర్, మణికుమార్ పాల్గొన్నారు.





వైజాగ్ : జగదాంబ 70MM AC DTS
వైజాగ్ : V-MAX V1
వైజాగ్ : సంగం AC DTS
వైజాగ్ : కిన్నెర AC DTS
వైజాగ్ : గోకుల్ AC DTS
వైజాగ్ : శ్రీకన్య AC DTS
వైజాగ్ : CMR ఐనాక్స్
వైజాగ్ : వరుణ్ ఐనాక్స్
వైజాగ్ : చిత్రాలయ ఐనాక్స్
వైజాగ్ : ముక్తాస్ ఎ2
104 ఏరియా : లక్ష్మీనరసింహ స్క్రీన్-1 AC DTS
గోపాలపట్నం : శంకర AC DTS
గాజువాక : కన్య కాంప్లెక్స్ AC DTS
గాజువాక : మోహిని 70MM AC DTS
శ్రీహరిపురం : SVC లిఖిత AC DTS
కూర్మన్నపాలెం : అన్నపూర్ణ AC DTS
పెదగంట్యాడ : అరుణపి॥పేలస్ AC DTS
షీలానగర్ : STBL Sc1 AC DTS
షీలానగర్ : STBL Sc2 AC DTS
అచ్యుతాపురం : STBL Sc1 AC DTS
విజయనగరం : ఆదిత్య AC DTS
విజయనగరం : NCS ఐనాక్స్ AC DTS
శ్రీకాకుళం : SVC రామలక్ష్మణ AC DTS
అనకాపల్లి : పర్తిసాయి AC DTS
అనకాపల్లి : సత్యనారాయణ స్క్రీన్-1 AC DTS
పాయకరావుపేట : SVC లక్ష్మీ AC DTS
పెందుర్తి : నటరాజ్ స్క్రీన్-1 AC DTS
పార్వతీపురం : టి.బి.ఆర్. AC DTS
యలమంచిలి : పరమేశ్వరి AC DTS
చోడవరం : సాయిలక్ష్మి AC DTS
తగరపువలస : రాములమ్మ AC DTS
నర్సీపట్నం : కన్య స్క్రీన్-1 AC DTS
బొబ్బిలి : వెంకటకృష్ణ AC DTS
రాజాం : అప్సర AC DTS
టెక్కలి : భవాని AC DTS
సాలూరు : లక్ష్మి AC DTS
ఎస్.కోట : శ్రీనివాస AC DTS
నరసన్నపేట : రాజేశ్వరి AC DTS
పలాస : హరిశంకర AC DTS
గజపతినగరం : వెంకటేశ్వర AC DTS
మధురవాడ : శ్రీదుర్గ AC DTS
కొత్తవలస : జయ AC DTS
నెల్లిమర్ల : సాయిసుభద్ర AC DTS
హీరమండలం : వరలక్ష్మి AC DTS
ఇచ్ఛాపురం : పూర్ణ AC DTS
పాతపట్నం : ఉమామహల్ AC DTS
కోటబొమ్మాళి : శివకృష్ణ DTS
వీరఘట్టం : బి.ఎం.ఆర్ DTS
బలిజిపేట : రామకృష్ణ AC DTS
పొందూరు : ఎం.పి.బాలాజి AC DTS
మాకవరపాలెం : శ్రీకన్య AC DTS
రణస్థలం : SVC రామాంజనేయ AC DTS
రవికమతం : వెంకటేశ్వర AC DTS
జామి : శ్రీలక్ష్మీనరసింహ DTS
దార్లపూడి : వరహ DTS
మందస : మహేంద్ర DTS
సోంపేట : శ్రీనివాస DTS
కవిటి : మహాలక్ష్మి DTS
పొందూరు : ఎం.పి.బాలాజి AC DTS
పాలకొండ : వెంకటగౌరి AC DTS
కశింకోట : తుల్జాభవాని DTS
కొత్తకోట : రవిటాకీస్ AC DTS
కెడి పేట : స్వామిసత్యనారాయణ AC DTS
కొత్తూరు : గౌరీశంకర AC DTS
భాగమతి
రిలీజ్: శ్రీవెంకటేశ్వర ఫిలింస్, ఫోన్: 0891-2515757


# మైన్స్ వాహనాలు అడ్డుకోవాలని వైసిపి డిమాండ్



నర్సీపట్నం : నాతవరం మండలంలో గల సరుగుడు గ్రామ పంచాయతీలో మైన్స్ తవ్వకాలు జరుగుతున్నందున మైన్స్ రవాణా చేయడంలో మించిన బరువుతో వాహనాలు వెళ్లడం వలన ఆ ప్రాంతంలో ఉన్న రోడ్లన్నీ పాడైపోతున్నాయని, వెంటనే మైన్స్ యాజమానులు, రవాణా వాహనాలపై చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పెట్ల ఉమాశంకరగణేష్ నర్సీపట్నం ఆర్డీవో కె.సూర్యారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ దీని వల్ల రాబోయే రోజుల్లో పూర్తిగా రోడ్లపై ప్రజలు ద్విచక్ర వాహనాలపై వెళ్లే అవకాశం కోల్పోయే ప్రమాదముందన్నారు. 10 రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే ప్రజలందరితో కలిసి మైన్స్ వాహనాలను నిలుపుదల చేస్తామని తెలియజేశారు.

# వైసిపి పార్టీ పాదయాత్ర

కొయ్యూరు : జగన్ పాదయాత్ర 1000 కిలో మీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలో వైసిపి నాయకులు పాదయాత్ర చేపట్టారు. కొయ్యూరు మండలంలోని బూదరాళ్ల, ఆడాకుల, శరభన్నపాలెం, కంతారం నుండి భారీ ఎత్తున వైసిపి నాయకులు, కార్యకర్తలు పాదయాత్రలు పాల్గన్నారు. ఈ సందర్భంగా మండల వైసిపి అధ్యక్షులు సూరిబాబు మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి అహర్నిశలు పాటు పడిన వైయస్సార్ పథకాలు మళ్లీ ప్రజలకు చేరాలంటే ఆయన తనయుడు జగన్ ముఖ్యమంత్రికావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసెల్ అధ్యక్షులు నడిగట్ల ఆనందరాజు, నూకన్నదొర, రాంబాబు, గాడి సత్యనారాయణ, లోకుల సోమగాంధీ, హుస్సేన్, సూర్యనారాయణ, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగన్ పాదయాత్ర మద్దతుగా పాదయాత్ర

రావికమతం : జగన్మోహనరెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర 1000 కిలో మీటర్ల పూర్తయినా సందర్భంగా ఆయనకు మద్దతుగా వైసిపి చోడవరం కోఆర్డినేటర్ కరణంధర్మశ్రీ ఆధ్వర్యంలో మండల కేంద్రం రావికమతం నుండి మేడివాడ వరకు వందలాది మంది కార్యకర్తలు భారీ ఎత్తున పాదయాత్ర చేశారు.

ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం నిరుద్యోగ భృతి వంటి హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. ప్రజాసంకల్పయాత్ర చేపట్టిన జగన్మోహనరెడ్డి వెయ్యి కిలో మీటర్లు నడక సాగించారన్నారు. ఆయనకు వైసిపి కాంగ్రెస్ శ్రేణులు తమ సంపూర్ణ మద్దతు తెలిపాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నలుమూలల నుండి వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగన్‌కు మద్దతుగా పాదయాత్ర

రోలుగుంట : వైసిపి అధినేత జగన్ పాదయాత్ర వెయ్యి కిలో మీటర్లు అయిన సందర్భంగా రోలుగుంట వైసిపి మండల అధ్యక్షులు మడ్డు అప్పలనాయుడు ఆధ్వ ర్యంలో మండలంలో వైసిపి నాయకులందరూ మూడు కిలో మీటర్ల మేర పాదయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో కొమరవోలు సర్పంచ్ గొర్లె చల్లమ్మనాయుడు, జానకిరాంపురం మాజీ సర్పంచ్ తమరాన వెంకటరమణ, కొవ్వూరు నాయకులు రాజారావు, కొండపాలెం సర్పంచ్ సన్యాసిదేముళ్లు, నక్కా రమణ, రోలుగుంట నాయకులు పోతల లక్ష్మీశ్రీనివాసరావు, వెంకట్రావు పాల్గొన్నారు.

# ప్రపంచకప్‌కి మరో అడుగు దూరంలో ఆసీస్



క్రిస్ట్‌చర్చ్: అండర్ 19 ప్రపంచకప్ సమరం తుది దశకు చేరుకుంటుంది. సోమవారం ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించి ఫైనల్స్‌కి దూసుకెళ్లింది. మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘాన్ జట్టు ఆటగాళ్లు ఎవరూ ఊహించినంతగా రాణించలేకపోయారు. ఇక్రం అలీ(80) మినహా మిగితా ఆటగాళ్లందరూ స్వల్ప స్కోర్‌కే పెవిలియన్ చేరారు. ఆసీస్ బౌలర్ జొనథన్ మెర్లో ధాటికి ఆఫ్ఘాన్ జట్టు విలవిలలాడిపోయింది. దీంతో 48 ఓవర్లలోనే 181 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది.

అయితే 182 పరుగుల విజయలక్ష్యాన్ని ఆసీస్ జట్టు కేవలం నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేధించింది. ఓపెనర్ ఎడ్వర్డ్స్(72) జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో ఆస్ట్రేలియా ఆఫ్ఘానిస్తాన్‌ని చిత్తు చేసి ఫైనల్స్‌లో బెర్త్ కన్ఫామ్ చేసుకుంది. కాగా మంగళవారం చిరకాల ప్రత్యర్థులు భారత్-పాకిస్తాన్‌ల మధ్య రెండో సెమీఫైనల్ జరుగనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు ఫిబ్రవరి 3న జరిగే ఫైనల్‌లో ఆస్ట్రేలియాతో తలపడనుంది.

# ప్రతిఒక్కరూ నేడు మౌనం పాటించాలి

## తెలంగాణ ప్రభుత్వం ఆదేశం

హైదరాబాద్: నేడు రెండు నిమిషాల పాటు మౌనం పాటించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఆదేశాలు జారీచేసింది. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించాలని స్పష్టం చేసింది. స్వాతంత్ర్యం కోసం బలిదానం చేసి వారి త్యాగాలను స్మరించుకుంటూ మౌనం పాటించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేసింది. రేపు ఉదయం 11 గంటల నుంచి రెండు నిమిషాల పాటు రాష్ట్ర వ్యాప్తంగా మౌనం పాటించాలని స్పష్టం చేసింది. ఆ సమయంలో రహదార్లపై వాహన రాకపోకలు కూడా నిలిపివేయాలని సూచించింది. సరిగ్గా ఉదయం 11 గంటలకు మౌనం పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

# పాఠశాలలకు పూర్వ విద్యార్థులు ఆదర్శప్రాయం

## మౌలిక వసతుల సదుపాయాలకు చర్యలు చేపడతాం .. జూనియర్ కళాశాల స్థాయి పెంపునకు కృషి

## మాధవధార ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవాల వేడుకలలో మంత్రి గంటా



మాధవధారః పూర్వ విద్యార్థుల సమ్మేళనం అభినందించదగ్గ విషయమని, పాఠశాలలకు పూర్వ విద్యార్థులు ఆదర్శ ప్రాయమని విద్యాశాఖ మంత్రి మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం గ్రేటర్ విశాఖ 39వ వార్డు పరిది లోనున్న జివిఎంసి ఉన్నత పాఠశాలలో జరుగుచున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం మహాసభ, పాఠశాల స్వర్ణోత్సవాల ( 50 వసంతాల వేడుక )ను పురస్కరించుకుని ముఖ్య అతిధిగా మంత్రి గంటా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి గంటా మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. విద్యార్థుల చదువు కోసం పాఠశాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ విద్యాభివృద్ధికోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల పాఠశాల అభివృద్ధి కోసం పాఠశాలలో సౌకర్యం కల్పించాలని పూర్వ విద్యార్థుల సంఘం కోరింది. ఇందులో భాగంగా పాఠశాలలో ఆడిటోరియం, ఆదనపు మరుగుదొడ్లు, పాఠశాలపై అదనపు భవనం నిర్మించాలని కోరారు. జూనియర్ కళాశాల స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని, అదే విధంగా 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా స్పందించిన మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రభుత్వ నిధుల నుండి అభివృద్ధి కార్యక్రమాలను చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న మాధవధార జివిఎంసి పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్ సనపల బంగారురాజును అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం గావించారు. ముందుగా మంత్రి గంటా జ్యోతి ప్రజ్వలన చేసి పాఠశాలలో చిన్నారులు రూపొందించిన కళా ఖండాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో మాధవధార జివిఎంసి పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవాల కమిటీ చైర్మన్ సనపల బంగారు రాజు, జిల్లా విద్యా శాఖ అధికారి బి. లింగేశ్వర రెడ్డి, సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివప్రసాద్, జివిఎంసి డిప్యూటీ డీఈవో లక్ష్మీనర్స, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజ, గ్రామస్తులు సనపల పాండురంగారావు, సనపల వరప్రసాద్, గొండు అచ్యుతరావు, పూజారి ఉదయ్ కుమార్, కర్రి రాజేష్ బాబు, సనపల మాధవరావు, పేడాడ సత్యనారాయణ, సనపల రత్నకుమారి, పైడి పుణ్యవతి, పప్పల రామరాజ్యం, చిన్నపాప, సుమతి తదితరులు పాల్గొన్నారు.



# 2 ఏళ్ల తర్వాత బడ్జెట్ ముందు మార్కెట్ల జోరు



న్యూఢిల్లీ: 34,000.. 35000.. 36000.. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ సెన్సెక్స్ ఇటీవల అనతి కాలంలోనే దాటేసిన అరుదైన మైలురాళ్లు. చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా నెల రోజుల వ్యవధిలోనే సెన్సెక్స్ 2000 పాయింట్లు ఎగబాకింది. అటు జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ నిఫ్టీ కూడా జోరును అందిపుచ్చుకుంటూ 11వేల మైలురాయిని తాకింది. 2018 ఆరంభం నుంచి మార్కెట్ల జైత్రయాత్ర కొనసాగుతూనే ఉంది. మధ్య మధ్యలో కొన్ని ఆటుపోట్లు వచ్చినప్పటికీ నిలదొక్కుకుంటూ చరిత్ర పుటల్లో కొత్త రికార్డులను లిఖిస్తున్నాయి. అక్టోబరు-డిసెంబరు ఆశాజనక త్రైమాసిక ఫలితాలు, అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు.. ఇలా కారణాలు ఏవైనా 2018-19 బడ్జెట్‌కు ముందు మాత్రం సూచీల దూకుడు ఆగట్లేదు.

అయితే ఇలా బడ్జెట్‌కు ముందు దేశీయ మార్కెట్లు రికార్డు స్థాయిలో లాభపడటం 12ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడే అంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. గతంలో 2006 బడ్జెట్ సమావేశాలకు ముందు సెన్సెక్స్ 5శాతం వరకు లాభపడింది. సమావేశాల తర్వాత కూడా దాదాపు 7శాతం పెరిగింది. ఆ తర్వాత మళ్లీ అలా జరిగిన దాఖలాలు లేవు. 2007 బడ్జెట్ సమావేశాలకు ముందు సెన్సెక్స్ భారీగా పతనమైంది. దాదాపు 9శాతం వరకు నష్టపోయింది. ఆ తర్వాత కోలుకోడానికి చాలా సమయమే పట్టింది.

గతేడాది ముందు వరకు బడ్జెట్ సమావేశాలకు ముందు సూచీలకు నష్టాలు తప్పలేదు. బడ్జెట్ తర్వాతే మెరుగుపడ్డాయి. అయితే 2017 బడ్జెట్ సమావేశాలకు ముందు మాత్రం సూచీలు కాస్త లాభాల్లోనే కదలాడినా అది 2006లో కంటే తక్కువే. కాగా.. ఈ ఏడాది మాత్రం సూచీలు అందుకు భిన్నంగా పయనిస్తున్నాయి. చరిత్రను తిరగరాస్తూ.. 2018 జనవరి నుంచి ఇప్పటివరకు సెన్సెక్స్ 6శాతానికి పైగా లాభాలను ఆర్జించింది. గతేడాది డిసెంబరు 26న 34వేల మైలురాయిని చేరుకున్న సెన్సెక్స్.. జనవరి 17న 35వేలు, 23న 36వేల మార్క్‌ను దాటేసింది.

ఈ ఏడాది బడ్జెట్‌పై సానుకూల ప్రభావం ఉండటమే ఇందుకు ప్రధాన కారణం అంటున్నారు మార్కెట్ నిపుణులు. అంతేగాక.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారీ సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ పురోగతి చెందుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జీడీపీ పెరిగే అవకాశముందని పలు అధ్యయనాలు చెప్పడం కూడా ఇందుకు దోహదపడింది. దీంతో సూచీలు వెనుదిరిగి చూడట్లేదు. మరి ఈ మురిపెం బడ్జెట్ వరకేనా.. తర్వాత కూడా కొనసాగుతోందా.. వేచి చూడాల్సిందే..!

# క్రికెట్ మ్యాచ్‌లో నగర పోలీస్ జట్టు విజయం ...

## రాణించిన విజయ్ కుమార్, శివ కేశవ

విశాఖపట్నం : పి.ఎం.పాలెం క్రికెట్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఇన్స్టిట్యూషన్ క్రికెట్ లీగ్ టోర్నీ మ్యాచ్‌లో సోమవారం M.O.V జట్టు పై నగర పోలీస్ జట్టు ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి బాటింగ్ ఎంచుకున్న సిటీ పోలీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ లు కోల్పోయి 187 పరుగుల భారీ స్కోర్ చేసింది.సిటీ పోలీస్ జట్టులో విజయ్ కుమార్ 56 పరుగులు చేసి అజేయంగా నిలవగా, మరోవైపు శివ కేశవ 44 పరుగులు చేసాడు. అనంతరం 188 పరుగుల భారీ లక్ష్యంతో బరి లోకి దిగిన వీ.వా.ఎ జట్టు 20 ఓవర్ లలో 6 వికెట్ ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది . సిటీ పోలీస్ జట్టు లో వర్రపసాద్ 20 పరుగులు ఇచ్చి 2 వికెట్ లు తీయగా విజయ్ కుమార్ 22 పరుగులు ఇచ్చి 1 వికెట్ పడగొట్టి విజయ్ కుమార్ మాన్ అఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు.



## ఐసీసీ అండర్-19 ప్రపంచకప్‌లో

# భారత్/పాక్ సెమీస్ నేడు



(న్యూజిలాండ్): ఇండియన్ ప్రీమియర్ లీగ్ వేలంలో రాత్రికి రాత్రే కోటీశ్వరులయ్యారు భారత అండర్-19 క్రికెట్ జట్టు సభ్యులు. వారు పట్టరాని ఆనందంలో ఉన్నారిప్పుడు! ఇదే ఉత్సాహంలో న్యూజిలాండ్‌లో జరుగుతున్న అండర్-19 వన్డే ప్రపంచకప్ సెమీస్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను చిత్తుచేసి తుదిపోరుకు అర్హత సాధించాలని అందరూ కోరుకుంటున్నారు.

బెంగళూరులో రెండు రోజుల పాటు జరిగిన ఐపీఎల్ వేలంలో భారత యువ క్రికెటర్లు మంచి ధరే పలికారు. సరాసరి 150 కిలోమీటర్ల వేగంతో బంతులు విసిరే ఎడమచేతి వాటం పేసర్ నాగర్‌కోటిని రూ.3.2 కోట్లు, మరో బౌలర్ శివమ్ మావిని రూ.3 కోట్లు పెట్టి కోల్‌కతా నైట్‌రైడర్స్ కొనుగోలు చేసింది. ఇక బ్యాటింగ్ సంచలనం, అండర్-19 సారథి పృథ్వీషాను దిల్లీ డేర్‌డెవిల్స్ 1.2 కోట్లు, శుభ్‌మన్‌గిల్‌ను కోల్‌కతా 1.8 కోట్లు పెట్టి సొంతం చేసుకున్నాయి. ఇక ఎడమచేతి వాటం స్పిన్నర్ అంకుల్‌రాయ్‌ను రూ.20 లక్షలు పెట్టి దిల్లీ, అభిషేక్ శర్మను రూ.55 లక్షలు పెట్టి ముంబయి కొనుగోలు చేశాయి. షాతో ఓపెనింగ్‌కు దిగే మన్‌జ్యోత్‌ను కనీస ధర రూ.20 లక్షలకు దిల్లీనే కొన్నది.












VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com